



# విజయభాను






విశాఖపట్నం, బుధవారం 18-04-2018 VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION సంపుటి : 41 సంచిక : 213 పేజీలు : 8 వెల : 1 రూపాయి






## ఈనెల 20న చంద్రబాబు ధర్మపోరాట దీక్ష



అమరావతి: ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుపై కేంద్ర ప్రభుత్వం వైఖరికి నిరసనగా ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 20 ధర్మపోరాట దీక్ష చేయనున్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు 12 గంటల పాటు దీక్ష చేయనున్నారు. ఈనెల 20న పుట్టిన రోజు వేడుకలకు దూరంగా ఉండాలని, ఆ రోజంతా నిరాహారదీక్షతో నిరసన తెలియజేయాలని చంద్రబాబు నిర్ణయించారు. తరువాయి 2లో

## బ్యాంకింగ్ వ్యవస్థను నాశనం చేస్తున్నారు : రాహుల్



అమేథి: ప్రభుత్వం బ్యాంకింగ్ వ్యవస్థను నాశనం చేస్తోందంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం బ్యాంకింగ్ వ్యవస్థను బలహీనం చేయడం వల్లే నగదు కొరత ఏర్పడిందని రాహుల్ దుయ్యబట్టారు. ఉత్తర్రపదేశ్ లోని తన నియోజకవర్గమైన అమేథి పర్యటనకు వెళ్లిన రాహుల్ తరువాయి 2లో

## భాజపా అధ్యక్ష పదవికి కంభంపాటి రాజీనామా




విజయవాడ: భాజపా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు తన పదవికి రాజీనామా చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా కు ఆయన తన రాజీనామా లేఖ పంపారు. గత నాలుగేళ్లుగా పార్టీ రాష్ట్ర బాధ్యతలు హరిబాబు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో కొత్త అధ్యక్షుడిని నియమించాలని జాతీయ నాయకత్వం కొద్దిరోజులుగా భావిస్తోంది. దీనికి సంబంధించిన కసరత్తు కూడా ప్రారంభించింది. ఈ నేపథ్యంలో కొత్త అధ్యక్షుని ఎంపికకు మార్గం సుగమం చేసేందుకు ఆయన రాజీనామా చేశారు. సోమవారం సాయంత్రం తన రాజీనామా లేఖను ఫ్యాక్స్ ద్వారా పంపారు.

ఇటీవలి కాలంలో మారిన రాజకీయ పరిణామాలు భాజపా నాయకత్వానికి సవాలుగా మారాయి. రాష్ట్ర విభజన సమయంలో హరిబాబును భాజపా రాష్ట్ర అధ్యక్షునిగా ప్రకటించారు. తెదేపాతో మిత్రధర్మం కాపాడుతూ నాలుగేళ్ల పాటు తన బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. మృధు స్వభావిగా ఉండే హరిబాబు.... తెదేపాతో విభేదాలు వచ్చిన సమయంలోనూ పూర్తి సంయమనంతో వ్యవహరించారు. తరువాయి 2లో










# ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

## రెవిన్యూ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి : జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్



విజయనగరం : రెవెన్యూ అధికారులు రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి అప్‌లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సమావేశంలో ఇచ్చిన ఆదేశాల మేరకు తీసుకున్న చర్యల రివ్యూ చేయాలని ఆయన సూచించారు. మీకోసం కార్యక్రమంలో గ్రీవెన్స్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆయన సూచించారు. గ్రీవెన్స్‌లో ఎక్కువగా ఇంటిస్థలాలు కావాలని దరఖాస్తులు వస్తున్నాయని, మండలాల్లో అభ్యంతరం లేని పోరంబోకు భూములను గుర్తింఇ వాటిని ఇళ్ల స్థలాల పంపిణీ చేసేవిధంగా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. విజయనగరం, పార్వతీపురం రెవిన్యూ డివిజన్‌లలో ఒకేసారి ఇళ్ల పట్టాలు పంపిణీకి కార్యక్రమం రూపొందించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. సంవత్సరంలో వసూలు చేయవలసిన మొత్తం నీటి పన్ను నెలవారీగా విభజించి ప్రతీ నెల నిర్ణయించిన నీటి పన్ను వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అన్ని కార్యాలయాల్లో నూటికి నూరుశాతం ఇ-ఆఫీస్ ద్వారానే ఫైల్స్ రన్ చేయాలని సూచించారు. మేన్యువల్‌గా ఫైల్స్ రన్ చేయవద్దని ఇ-ఆఫీస్ ద్వారా మాత్రమే రన్ చేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల వివరాలు బయోమెట్రిక్‌లో నమోదు చేసి హాజరు కూడా బయోమెట్రిక్ హాజరు తీసుకోవాలని ఆయన సూచించారు. రెవెన్యూ అధికారులు ఎక్కడైనా బాధ్యతా రహితంగా ప్రవర్తించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఉన్న వనరులను సక్రమంగా వినియోగించుకొని విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. పై అధికారుల ఆదేశాలు విధిగా పాటించాలని, ఎవరైనా పాటించకపోయినట్లయితే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్-2 కె.నాగేశ్వరరావు, డిఆర్‌ఓ రాజ్‌కుమార్, విజయనగరం, పార్వతీపురం ఆర్‌డిఓ సాల్మన్ రాజు, సుదర్శనదొర, కెఆర్‌ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ శ్రీలత, ఎస్‌డిసిలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.



### అన్ని శాఖల సమన్వయంతో విపత్తుల సమయంలో

# ముందస్తు చర్యలు తీసుకోవాలి

## తుఫాన్ ప్రాంతాల ప్రజలకు ముందస్తు హెచ్చరికలు చేయాలి

## జేసీ-2 కె.నాగేశ్వరరావు



విజయనగరం : తుఫాన్‌ల వలన జరిగే నష్టానలు తగ్గించేందుకు అన్ని శాఖల సమన్వయంతో పనిచేసి ముందస్తు ఏర్పాట్లు చేయాలని సంయుక్త కలెక్టర్-2 కె.నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన విపత్తుల నివారణ కమిటీ సమావేశం ఆయన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుఫాన్‌లు వచ్చేటప్పుడు ముందుగానే సమాచారం అందుతున్నందున అట్టి సమాచారాన్ని తుఫాన్ ప్రభావిత ప్రాంత ప్రజలకు టాం టాం, మైక్‌ల ద్వారా తెలియజేసి ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయన సూచించారు. తుఫాన్ సంబంధించే సమయంలో జాలర్లు చేపల వేటకు వెళ్లకుండా వారికి సమాచారం అందించాలని, అదేవిధంగా చేపల వేటకు వెళ్లేవారి వెనుకకు రప్పించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. తుఫాన్ వచ్చే సమయంలో సముద్ర తీర ప్రాంతంలో వున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, వారు ఉండేందుకు తుఫాన్ షెల్టర్లు, పాఠశాలల్లో వసతికల్పించి వారికి భోజన సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తుఫాన్ సమయంలో ఎటువంటి ప్రాణ నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. తుఫాన్ సమయంలో ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ టీముల సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. నిత్యావసర వస్తువులను అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొంతమంది జిల్లా అధికారులను గ్రామాలకు ఇన్‌ఛార్జి అధికారులుగా నియమించడం జరిగిందని వారు ఆ గ్రామాలకు వెళ్లి పర్యవేక్షిస్తారని ఆయన తెలిపారు. జిల్లాలో 43 తుఫాన్ షెల్టర్లు వున్నాయని వాటిని మరమ్మతులు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. వ్యవసాయ శాఖ, ఉద్యానవన, మత్స్య, పశు సంవర్ధక, నీటిపారుదల, పబ్లిక్‌హెల్త్, పోలీసు, ఫైర్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, రెవెన్యూశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముందస్తు విపత్తుల నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ రాజ్‌కుమార్, విజయనగరం, పార్వతీ పురం ఆర్‌డిఓ సాల్మన్‌రాజు, సుదర్శనదొర, జిల్లా అధికారులు, ఎస్‌డిసిలు, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

### చీపురుపల్లి విద్యుత్ సహకారం సంఘంలో జరిగిన

## కోట్ల రూపాయల గల్లంతుపై విచారణ జరిపించాలి



విజయనగరం : చీపురుపల్లి గ్రామీణ విద్యుత్ సహకారం సంఘంలో (ఆర్.ఇ.సి.ఎస్)లో జరిగిన 1.79 కోట్లు రూపాయలు గల్లంతుపై సహకార సంఘాల చట్టం సెక్షన్ 51 ప్రకారం విచారణ జరిపించాలని వైసిపి జిల్లా రాజకీయవ్యవహారాల సమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావు(చినశ్రీను), విజయనగరం పార్లమెంటు నియోజక వర్గం పార్టీ అద్యక్షులు బెల్లాన చంద్రశేఖర్‌లు కలక్టర్‌ను కోరారు. మంగళవారం వారితో పాటు ఆర్.ఇ.సి.ఎస్.సంస్థ సభ్యులు జిల్లా కలక్టర్‌ను కలసి వినతి పత్రం సమర్పించారు. వినియోగదారులు చెల్లించిన రూ.1.79 కోట్లు రూపాయలు గల్లంతై ఇరవైరోజులు గడుస్తున్నా ఇంతవరకు దానిపై స్పష్టత రాకపోవడం వెనక బలమైన కారణాలుండ వచ్చని వారు అనుమానం వ్యక్తం చేశారు. ఇంత జరిగినా సంస్థ పాలక వర్గం గాని, అధికారులుగాని వినియోగదారులు, ప్రజలలో నెలకొన్న అనుమానాలను ఎందుకు నివృత్తి చేయలేక పోతున్నారని శ్రీనివాసరావు, చంద్రశేఖర్‌లు ప్రశ్నించారు. గల్లంతయిన రూ. 1.79 కోట్లుతో సంస్థ ట్రాన్స్‌పార్మర్లు, ఎల్.ఇ.డి.బల్బులు తదితర సామగ్రి కొనుగోలు చేయవచ్చని వారు పేర్కొన్నారు. గతంలో మేము ఇదే విషయమై కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించిన మీదట ఆయన విచారణాధికారిని నియమించారని, దానిపై ఇప్పటికి వాస్తవాలు వెలుగులోకి రానందున ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. వేలుకు వేలు రూపాయలు జీతాలు పుచ్చుకుంటున్న ఆర్.ఇ.సి.ఎస్. అధికారులు ఏమి చేస్తున్నట్లని వారు ప్రశ్నించారు. 2017 ఏప్రిల్, మే, జూన్ నెలల వినియోగదారుల చెల్లించిన బిల్లులు పైకం సంస్థకు జమ అయ్యిందా లేదా అని సరిచూచు కోవాల్సిన బాద్యత సంస్థ ఉద్యోగులకు లేదా అని వారు నిలదీశారు.ఇందుకు కలక్టరు సానుకూలంగా స్పందించి సెక్షన్ 51 ప్రకారం విచారణ జరిపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు, డి.సి.ఎమ్.ఎస్.చైర్మన్ ఎస్.వి. రమణరాజు, ఆర్.ఇ.సి.ఎస్.మాజీ చైర్మన్ పొన్నాడ వెంకటరమణ, పార్టీ ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములునాయుడు, మాజీ జెడ్పీటీసి కోట్ల విశ్వేశ్వరరావు, మాజీ ఏ.ఎమ్.సి. చైర్మన్ విశ్వేశ్వరరావు, మాజీ ఎం.పి.పిలు తాడి వేణు. కృష్ణంనాయుడు, వైకాపా నేతలు ఇప్పిలి అనంత, వలిరెడ్డి శ్రీనివాసులునాయుడు తదితరులు ఉన్నారు.

### ఇంటికి ఆలస్యంగా రావడంతో

## పెద్దలకు భయపడి 'గ్యాంగ్ రేప్'గా చెప్పిన బాధితురాలు

### విజయనగరం జిల్లా ఎస్పీ పాలరాజు



విజయనగరం : జిల్లా పూసపాటిరేగ మండలానికి చెందిన దివ్యాంగురాలైన ఓ దళిత యువతిపై సారిపల్లికి వెళ్ళే నిర్జన ప్రదేశంలో ఆటో డ్రైవరు మరొక వ్యక్తి మాన భంగ చేసినట్లుగా బాధితు రాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తును ప్రారంభి చినట్లుగా జిల్లా ఎస్పీ జి. పాలరాజు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో వెలుగుచూసిన వాస్తవాలను జిల్లా ఎస్పీ మంగళవారం వెల్లడించారు. బాధితురాలి కథనం ప్రకారం పూసపాటిరేగ మండలానికి చెందిన దివ్యాంగురాలు విజయనగరం పూల్‌బాగ్ వద్ద ఉన్న తన అక్క ఇంటికి వెళ్లేందుకు ఈనెల15వ తేదీ సాయంత్రం 6గంటల సమయంలో విజయనగరం కోట జంక్షన్‌కు వచ్చినట్లు, తాను పూల్‌బాగ్ వెళ్ళేందుకు ఒక ఆటోను ఎక్కినట్లు, అప్పటికే ఆటోలో ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు, తాను పూల్‌బాగ్ వద్ద దిగిపోతానని చెప్పినప్పటికి, సదరు వ్యక్తులు ఆటోను ఆపకుండా నెల్లిమర్ల వైపు వెళ్ళిపోయినట్లు, ఒక దాబా వారు బిర్యానీ కొని, సారిపల్లి వైపు ఒక కిలో మీటరు దూరంలోని ఒక నిర్జన ప్రదేశానికి తీసుకొని వెళ్ళినట్లు, ఆటోలో ఒక వ్యక్తి తనపై అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు, మరో వ్యక్తి కూడా అఘాయిత్యానికి పాల్పడేందుకు ప్రయత్నించగా, తాను కేకలు వేసినట్లు, అటుగా సైకిలుపై వస్తున్న వ్యక్తిని గమనించి, వారు తనను అక్కడ విడిచి పారిపోయినట్లు, ఆమెను సదరు వ్యక్తి జంక్షన్ వద్దకు తీసుకొని విడిచిపెట్టగా ఆమె ఆటోలో కోట జంక్షన్‌కు, అక్కడి నుండి పూసపాటిరేగలోని తన ఇంటికి వెళ్ళిపోయినట్లు, కుటుంబ సభ్యులు తనని ప్రశ్నించగా తాను అపస్మారక స్థితిలో ఉన్నట్లు, జరిగిన విషయాలను కుటుంబ సభ్యులకు తెలపగా, తన బట్టల మార్చి, స్థానిక ఆసుపత్రికి తీసుకొని వెళ్ళినట్లు, అక్కడ నుండి విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వచ్చినట్లు తెలిపినట్లు ఎస్పీ వివరించారు.

## పాదయాత్ర పేరుతో రూ.కోట్లు వసూళ్లు : దేవినేని

విజయవాడ: ప్రత్యేక హోదా ఉద్యమంలో వైకాపా కార్యకర్తలు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తోంటే.. జగన్ ఏసీ టెంటులో తన కుటుంబ సభ్యులతో కాలక్షేపం చేశారని మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. సీఎం పదవి కోసమే జగన్ కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని విమర్శించారు. జగన్ పాదయాత్ర పేరు చెప్పి వైకాపా నేతలు వ్యాపారుల నుంచి కోట్లాది రూపాయలను వసూలు చేస్తున్నారని తీవ్రమైన ఆరోపణలు చేశారు. జగన్ కృష్ణా జిల్లాలో అడుగుపెడుతున్న సందర్భంగా కనకదుర్గ వారధి ఊగిందంటూ ప్రచారం చేసుకోవటం విడ్డూరంగా ఉందని మంత్రి ఎద్దేవా చేశారు. తన నియోజకవర్గమైన మైలవరంలోకి అడుగుపెడుతున్న జగన్ స్థానికంగా ఉన్న చెరువునీటిని నెత్తిన

జల్లుకుని పాపాలు కడుక్కోవాలని మంత్రి వ్యాఖ్యానించారు. ప్రజాసంకల్ప యాత్రలో ఆయన నడిచే రహదారులను తెలుగుదేశం ప్రభుత్వమే పూర్తి చేసిందని అన్నారు.

మొదటి పేజీ తరువాయి

## భాజపా అధ్యక్ష పదవికి కంభంపాటి రాజీనామా

అవతలి వైపు నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నా తన సహజ ధోరణిలో వ్యవహరించారే తప్ప... ఎక్కడా దూకుడుగా వెళ్లలేదు. పార్టీలోని కొందరు నేతలు ఈ విషయంలో దూకుడు పెంచాలని సూచించినా తన సహజత్వానికి భిన్నంగా వెళ్లలేనని తేల్చిచెప్పేవారు. కొత్త అధ్యక్షుని ఎంపిక కోసం పార్టీ కసరత్తు చేస్తోన్న తరుణంలో తన పదవికి రాజీనామా చేశారు. 2019 ఎన్నికలకు ఏడాది ముందే కొత్త అధ్యక్షుడి ఎంపిక జరగాలనేది హరిబాబు అభిప్రాయం.

ఇప్పటికే పలువురి పేర్లను బీజేపీ కేంద్ర నాయకత్వం పరిశీలిస్తోంది. మాణిక్యాలరావుని పిలిచి మాట్లాడగా ఆయన విముఖత వ్యక్తం చేశారు. దీంతో సోము వీర్రాజు, కన్నా లక్ష్మినారాయణ, పురంధరేశ్వరి, ఆకుల సత్యనారాయణ పేర్లను పరిశీలిస్తున్నారు. సామాజిక సమీకరణలే కొత్త అధ్యక్షుని ఎంపికలో కీలకం కానున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## ఈనెల 20న చంద్రబాబు ధర్మపోరాట దీక్ష

### 30న తిరుపతిలో బహిరంగ సభ

రాష్ట్రానికి కేంద్రం చేసిన అన్యాయంపై ఈనెల30న తిరుపతిలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. నమ్మక ద్రోహం, కుట్రల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో తిరుపతి సభ నిర్వహించనున్నారు.

## బ్యాంకింగ్ వ్యవస్థను నాశనం చేస్తున్నారు: రాహుల్

విలేకరులతో మాట్లాడారు. పెద్ద నోట్ల రద్దు సమయంలోనూ మనల్ని క్యూలలో నిలబెట్టి మన జేబుల్లో నుంచి రూ.500, రూ.1000నోట్లను తీసుకుని.. ఆ డబ్బును వ్యాపారవేత్త నీరవ్ మోదీ జేబులో పెట్టారని రాహుల్ విమర్శలు చేశారు.

ప్రధాని మోదీకి దేశమంతా తిరిగే సమయం ఉంది కానీ లోక్‌సభలో 15నిమిషాలు ప్రసంగించడానికి సమయం లేదా, ఆయన 15నిమిషాలు కూడా తమ ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేరని విమర్శలు చేశారు.

అలాగే కేంద్ర ప్రభుత్వం స్లోగన్ అచ్ఛే దిన్‌పైనా రాహుల్ విమర్శలు చేశారు. ఆ మంచి రోజులు ఎప్పుడు వస్తాయంటూ ప్రశ్నించారు. నీరవ్, మెహుల్ ఛోక్సీలాంటి ఓ 15 మందికి మాత్రమే మంచి రోజులు వచ్చాయని, రైతులకు, కార్మికులకు, ప్రజలకు ఇవి చెడ్డ రోజులని రాహుల్ ఎద్దేవా చేశారు. ఢిల్లీ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్, ఉత్తర్రపదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్ రాష్ట్రాల్లో ఏటీఎంలలో డబ్బు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్న సంగతి తెలిసిందే. నగదు కొరత తాత్కాలికం మాత్రమే, త్వరలో సమస్య పరిష్కరిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ వెల్లడించారు.

# ఏప్రిల్ 30లోగా రుణాలు మంజూరు చేయకపోతే తగు చర్యలు

### బ్యాంకర్లకు స్పష్టం చేసిన జిల్లా ఇన్‌చర్జి కలక్టర్ జి.సృజన



విశాఖపట్నం : ఏప్రిల్ 30లోగా పలు ప్రభుత్వ శాఖల ద్వారా మంజూరుచేసిన పథకాలకు రుణాలు మంజూరుచేయాలని బ్యాంకర్లను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ జి.సృజన ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ సమావేశమందిరంలో బ్యాంకర్లతో డిసిసి సమావేశాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాల అమలుపై లబ్ధిదారులకు సబ్సిడీపై రుణాలను ఈ నెల 30వ తేదీ లోగా మంజూరుచేయాలని లేని సమక్షంలో వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. రుణాలు మంజూరు చేయని బ్యాంకుల నుండి ప్రభుత్వ డిపాజిట్లను వెనక్కి తీసుకుంటామని హెచ్చరించారు. 2016-17, 2017-18 ఆర్థిక సంవత్సరాలలో మంజూరుచేసిన యూనిట్లు, బ్యాంకు రుణాలపై కలెక్టరు బ్యాంకువారీ సమీక్షించారు. అధికారులు కూడా బ్యాంకర్ల వద్దకు వెళ్లి వారి శాఖాపరమైన రుణాలను మంజూరుచేసుకునేలా చూడాలని ఆదేశించారు. జేసీ-2, బిసి., ఎస్‌సి కార్పొరేషన్ల, ఇ.డి.లతో చర్చించి సబ్సిడీలు మంజూరు కాని జాబితాలను త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. అధికారులు లబ్ధిదారులను కలసి మోటివేట్ చేసి ముందుకు వచ్చేలా కృషిచేయాలని అన్నారు. ఈ నెలలోగా గరిష్టంగా పూర్తయ్యేలా బ్యాంకర్లు, అధికారులు కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో ఎల్‌డిఎం జెఎల్‌ఎన్ మూర్తి, జేసీ-డా.ఎ. సిరి, ఇ.డి. లు మహాలక్ష్మి, గీతాదేవి, యూసిడి పిడి శ్రీనివాసన్, పలు బ్యాంకులకు చెందిన అధికారులు హాజరైనారు.

## బీజేపీతో పొత్తుపై వైసీపీ ఎంపీ స్పందన

హైదరాబాద్ : ఏపీకి ప్రత్యేకహోదా కల్పించే విష యంలో జోక్యం చేసుకోవాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కోరారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు. ఈ మేరకు వారు మంగళవారం రాష్ట్రపతిని కలిసి విన్నవించారు. హోదాతో పాటు విభజన హామీలను అమలు చేయడం లేదని, దీంతో రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం జరుగుతోందని రాష్ట్రపతికి తెలిపినట్టుగా వైసీపీ ఎంపీలు ప్రకటించారు. రాష్ట్రపతితో భేటీ అనంతరం ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికల ప్రచారం సందర్భంగా మోడీ ఏపీకి ప్రత్యేకహోదా కల్పిస్తామనే హామీని ఇచ్చారని, ఏపీకి ఢిల్లీకి మించిన గొప్ప స్థాయి రాజధాని నిర్మిస్తామని అన్నారని.. అయితే ఆ హామీలు నిలబెట్టుకోకుండా ఘోర తప్పిదం చేశారని తాము రాష్ట్రపతికి వివరించామని మేకపాటి అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధన విషయంలో రాజ్యాంగబద్ధంగా ఏమేం చేయగలమో తాము ఆ పనులన్నీ చేస్తామని మేకపాటి అన్నారు. నిన్న ఏపీ బంద్ విజయవంతం అయ్యిందని, బంద్ ద్వారా ఏపీ ప్రజలు ప్రత్యేకహోదా ఆకాంక్షను చాటారన్నారు. ఇప్పటికే తాము ఎంపీ పదవులకు రాజీనామాలు చేశామని, అవి ఆమోదం పొందుతాయని వైవీ సుబ్బారెడ్డి అన్నారు. వీరితో పాటు వరప్రసాద్, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వైఎస్ అవినాష్ రెడ్డిలు రాష్ట్రపతిని కలిసిన వారిలో ఉన్నారు.

ఇక వచ్చే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీతో పొత్తు ఉంటుందా? అనే ప్రశ్నకు మేకపాటి సమాధానం ఇస్తూ.. అలాంటిదేమీ లేదని అన్నారు. తమది సెక్యులర్ పార్టీ అని తాము బీజేపీతో ఎన్నికల పొత్తును ఎలాంటి పరిస్థితుల్లోనూ పెట్టుకోమని రాజమోహన్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే ఎన్నికల అనంతరం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేవారికి మద్దతును ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

## ప్రైవేటు బస్సులో రూ.100కోట్ల నగదు స్వాధీనం

చిక్కబళ్లాపూర్: కర్ణాటకలోని చిక్కబళ్లాపూర్ జిల్లా తిప్పగానిపల్లి వద్ద పోలీసులు ఓ ప్రైవేటు బస్సులో రూ.100కోట్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతపురం-బళ్లారి జాతీయరహదారిపై తిప్పగానిపల్లి వద్ద ఈరోజు పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఓ ప్రైవేటు బస్సును తనిఖీ చేయగా భారీ మొత్తంలో నగదు బయటపడింది. ఆ నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు లెక్కించగా రూ.100కోట్లకు పైగా ఉన్నట్లు తేలింది. ఈ నగదును ఎక్కడి నుంచి ఎక్కడికి తీసుకెళ్తున్నారన్న దానిపై కర్ణాటక పోలీసులు ఆరా తీస్తున్నారు. త్వరలో కర్ణాటక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇంత మొత్తంలో నగదు పట్టుబడటం సంచలనంగా మారింది.

## అదనపు లోడును స్వచ్ఛందంగా క్రమబద్ధీకరించుకునే వినియోగదారులకు

# ఏపీఈపీడీసీఎల్ రాయితీ

విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని అదనపు విద్యుత్‌ను వినియోగిస్తున్న గృహ విద్యుత్ వినియోగదారుల అదనపు లోడును స్వచ్ఛందంగా క్రమబద్ధీకరించుకునే వారికి 50శాతం రాయితీని అందించనున్నా మని సంస్థ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ హెచ్.వై.దొర పేర్కొన్నారు. అదనపు లోడు క్రమబద్ధీకరించుటకు డెవలప్‌మెంట్ ఛార్జీలు చెల్లించేందుకు ముందుకు వచ్చిన గృహ వినియోగదారలకు 50శాతం రాయితీని ఇచ్చేందుకు ఏపీఈపీడీసీఎల్ ప్రతిపాదించగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆమోదం తెలిపిందని, ఏపీఈఆర్‌సీ ఆదేశాల ప్రకారంగా అదనపులోడు కలిగి వున్న వినియోగదారుడు కిలోవాట్ ఒక్కంటికి రూ.1200లు చొప్పున డెవలప్‌మెంట్ ఛార్జీల రూపంలో చెల్లించ వలసి వుండగా రూ.600లు చొప్పున చెల్లిస్తే సరిపోతుందన్నారు.అదనపు లోడుకు సెక్యూరిటీ డిపాజిట్‌గా ప్రస్తుతం ఉన్న ఛార్జీలు యధావిధిగా చెల్లించవలసి వుంటుందన్నారు.

సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల గృహ విద్యుత్ వినియోగదారులు తాము ఏపీఈపీడీసీఎల్‌తో కుదుర్చుకున్న ఒప్పందపు లోడుకన్న ఎక్కువ లోడు వున్న విద్యుత్ పరికరాలను ఎప్పటికప్పుడు తమ గృహాలలో విద్యుత్‌శాఖ అధికారులకు నివేదించకుండా, అదనపు లోడును క్రమబద్ధీకరించుకోకుండా విద్యుత్‌ను వినియోగించడం వలన ఊహించని విద్యుత్ లోడ్ పెరిగి, ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక భారం పడటం వలన విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు, లో వోల్టేజి, ఫ్యూజ్ పోవటం, ట్రాన్స్‌ఫార్మర్లలో లోపములు లేక కాలిపోవటము వంటివి జరుగుతున్నయన్నారు. ఈ లోపములను అధిగమించుటకు గృహ విద్యుత్ వినియోగదారులు స్వచ్ఛందగా ఎడిషినల్ లోడును క్రమబద్ధీకరించుకొనుటకు ఏపీఈపీడీసీఎల్ అవకాశం కల్పిస్తుందన్నారు. మే 1వతేదీ నుండి మే 30వతేదీ వరకు వినియోగదారులు ఎడిషినల్ లోడులకు తగిన డెవలప్‌మెంట్ ఛార్జీలు (కిలోవాట్ ఒక్కంటికి రూ.600లు చొప్పున) మీ సేవ కేంద్రముల ద్వారా చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. పైన నిర్ధేశించిన సమయంలోపల క్రమబద్ధీకరణ చేసుకొనని విద్యుత్ వినియోగదారులు ప్రస్తుత విధానం ప్రకారం కిలోవాట్ ఒక్కంటికి రూ.1200లు చొప్పున చెల్లించవలసి వుంటుందన్నారు.



# నూకాంబిక సన్నిధిలో

## ఎమ్మెల్యే గణబాబు

అనకాపల్లి : ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారిని తెలుగుదేశం ఎమ్మెల్యే పెతకంశెట్టి గనబాబు దంపతులతో అమ్మ వారిని దర్శించుకున్నారు. వీరికి ముందుగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మళ్ల సురేంద్ర, ఆలయ కార్యనిర్వాహణ అధికారిణి ఎన్. సుజాత స్వాగతం పలికారు. అనంతరం, అమ్మవారి చిత్రపటం ప్రసాదంను, ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సివరేజ్ ప్రాజెక్టుతో జివిఎంసి దివాలా

## అప్పులతో ప్రాజెక్టు చేపట్టొద్దు

విశాఖపట్నం : 412 కోట్ల రూపాయలతో జివిఎంసి పెందుర్తి ప్రాంతంలో సివరేజ్ మరియు రీసైక్లింగ్ ప్రాజెక్టు చేపట్టటానికి జివిఎంసి నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు వల్ల జివిఎంసి పూర్తిగా అప్పుల ఊబిలోకి కూరుకుపోతుంది. ఈ ప్రాజెక్టు వల్ల విశాఖ ప్రజలకు తీవ్ర హాని జరుగుతుందని సిపిఎం భావిస్తున్నది. తక్షణం ఈ చర్యలు ఉపసంహరించాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నది. ఈ ప్రాజెక్టుకి అయ్యే ఖర్చు పూర్తిగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని సిపిఎం కోరుతున్నది.

ప్యాకేజీ -1 క్రింద 412 కోట్లతో పెందుర్తి ఏరియాలో సివరేజ్ మరియు రీసైక్లింగ్ ప్రాజెక్టుకి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. వెంటనే జివిఎంసి 150 కోట్లు గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కంపెనీకి ఇవ్వాలి. మిగిలిన 262 కోట్లు ఎపియుఐఎంఎల్ సంస్థ ప్రైవేట్ సంస్థల నుండి జివిఎంసికి అప్పు ఇస్తుంది. అంటే ఈ ప్రాజెక్టు వ్యయం పూర్తిగా జివిఎంసి భరించాలి. ఇప్పటికే జివిఎంసికి 400 కోట్లు పైబడి అప్పు ఉంది.

మరొక 350 కోట్లు ఆర్వో ప్రాజెక్టు క్రింద జివిఎంసి ఖర్చు చేయాలి. పరిశ్రమల కొరకు ఇది చేపట్టింది. గతంలో జె.ఎన్ఎన్‌యుఆర్ఎం క్రింద చేపట్టిన భూ గర్భడ్రైనేజీ పథకం పూర్తిగా మూలనపడింది. గాజువాక, మల్కాపురం ప్రాంతాల్లో మినహా అన్ని ప్రాంతాల్లో యుజిడి పూర్తియ్యింది. కాని ప్రారంభిం చలేదు. దీనికి కారణం ఎస్‌టిపిలు పూర్తికాలేదు. కనుక ఇవన్నీ ప్రైవేటీకరణలో భాగమే.

# దోషులను ఉరి తీయాలి




అనకాపల్లి : ఎనిమిదేళ్ల బాలికను అతి కిరాతకంగా అత్యాచారం చేసిన నలుగురు దోషులను కఠినంగా శిక్షించి ఉరి తీయాలని విభన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జీవి ఎంసీ కార్యాలయంలో గల గాంధీ విగ్రహం వద్ద, సేవ్ చిల్డ్రన్, సేవ్ గర్ల్ అనే నినాదంతో విద్యార్థులు, ప్రతిభా వంతులు కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేసారు. ఈ సందర్భంగా సంఘ వ్యవస్థాపకులు పాత్రుపల్లి వీరు యాదవ్ మాట్లాడుతూ జమ్మూ లోని కుదువా గ్రామంలో ఏనిమిదేళ్ల బాలిక అసిఫాను అతి కిరాతకంగా అత్యాచారం చేసి, చంపిన నలుగురు దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన అన్నారు. పసిపిల్ల అని చూడకుండా, కామంతో కళ్లు మూసుకుపోయి, అతి పవిత్రంగా కొలిచే దేవాలయంలో చిన్నారి అసిసాపై ఇంతటి ఘోరమైన అగత్యానికి, పాల్పడడం, దీనికి స్థానిక బిజేపి నేతలు, పోలీసులు, వంత పాడడం, అలాగే బాధితులకు వ్యతిరేకంగా ర్యాలీలు ప్రదర్శనలు చేసి, దోషులకు మద్దతు ఇవ్వడం, చాలా దారుణమని, భారతదేశ యొక్క పరువును బ్రష్టు పట్టించేలా వ్యవహరిస్తున్న ఇలాంటి దోషులను కఠినంగా శిక్షించాలని నడి రోడ్డుపై ఉరి తీయాలని, వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రముఖ న్యాయవాధి (విశాఖ మహిళా వేదిక) కేధా కుసుమ మాట్లాడుతూ ఢిల్లీలో నిర్భయ ఉదాంతం తరువాత దోషులు ఏవరైనా కాని, వాళ్లని తలదన్నేలా నిర్భయచట్టం తీసుకువచ్చినా కూడా దేశంలో ఇంకా ఇలాంటి దారుణ సంఘటనలు జరగడం చూస్తుంటే, చట్టంపై, న్యాయంపై, దోషులకు ఎటువంటి భయంలేక పోవడమేనని, న్యాయ వ్యవస్థలోను వాటిని అమలు చేసేతీరు లోను కఠినంగా వ్యవహరించి, తప్పుచేయాలని, ఆలోచన వచ్చిన వాడికి శిక్షలు కూడా ఎంత కఠింగా ఉంటాయో తెలియజేసేలాగా చట్టంలో, న్యాయ వ్యవస్థలో ఇంప్లిమెంటేషన్ తీసుకురావలని ఆమె కోరారు.

ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు కొణతాల హరనాధబాబు మాట్లాడుతూ దోషులను నడిరోడ్డుపై శిక్షించి, ఉరి తీయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, విద్యార్థినిలు, తదితరులు పాల్గొన్నారు.

# వేసవి తాపాన్ని తగ్గించేందుకు చలివేంద్రాలు ఉపయోగపడతాయి

## సనపల బంగారురాజు



మాధవధార : వేసవి తాపాన్ని తగ్గించేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని ఉత్తర నియోజక వర్గం సంఘసేవకులు, జివిఎంసి పాఠశాల పూర్వవిదార్థుల కమిటి ఛైర్మన్ సనపల బంగారురాజు అన్నారు. ఉత్తర నియోజక వర్గ ఫరిదిలో గల మాధవధార బిర్లా జంక్షన్ వద్ద గల బస్టాప్ వద్ద మంగళవారం చవివేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర నియోజక వర్గంలో పలు ప్రాంతాలలో చలివేంద్రాలు ఎర్పాటు చేయ్యనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మొదటిగా ఇచ్చట ఎర్పాటు చేసి న్నట్లు తెలిపారు. వేసవి వల్ల ప్రజల ఇబ్బందు లను దృష్టిలో పెట్టుకొని చలివేంద్రాలు ఎర్పాటు చేసిన్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో నిత్యం ప్రజలు అధికంగా బస్‌స్టాప్ వద్దకు వస్తుంటారని అన్నారు. పాదాచారులు, వాహనదారులు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా ప్రతి రోజు మజ్జికను ఎర్పాటు చేయ్యన్నుట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సనపల పాండురంగారావు, మూల రాము, కంచరాన అజయ్, సనపల తేజ, కర్రి రాజేష్‌బాబు, సనపల మాధవరావు, సనపల అనీల్, టి.దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఎటువంటి లోపం లేకుండా కార్యక్రమాలు నిర్వహించండి

## - కమిషనర్ హరినారాయణన్




విశాఖపట్నం : చందనోత్సవం సందర్భంగా పారిశు ధ్యం, త్రాగునీటిసరఫరా లో ఎటువంటి లోపం లేకుండా నిర్వహించాలని జివియంసి కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. క్షేత్ర పర్యటన సందర్భంగా ఆరవజోన్ సింహాచలక్షేత్రం, పరిసరాలలో మంగళవారం ఆయన పర్యటించి పలుసూచనలు చేశారు.

టాయిలెట్లను మరింత పరిశుభ్రంగా నిర్వహించాలని పరిసరాలను ఎప్పటికప్పుడు మరింత శుభ్రపరచాలని సూచించారు. అవసరమైతే మొబైల్ టాయిలెట్స్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. పర్యటనలో జోనల్ కమిషనర్ సత్యనారాయణ, ఏ.యం.ఓ.హెచ్. డా.జ్యోతి, ఇ.ఇ రాజరావు, యస్.జయరాం, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి నిర్మాణ మంజూరు పత్రాల పంపిణీ



కంచరపాలెం : జివిఎంసి 43 వ వార్డు పరిది దయానంద నగర్, రాజీవ్ కోలని మురికి వాడల్లో నివశిస్తున్న స్థానిక ప్రజలకు ఇంటి నిర్మాణ మంజూరు పత్రాల ను జివిఎంసి జోన్ -4 అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చిట్టిబాబు మంగళవారం ఉదయం నివాసి తులకు అందజేశారు . కార్యక్రమంలో పాల్గున్న టిడిపి 43 వ వార్డు అద్యక్షుడు శరగడం రాజశేఖర్ మాట్లా డుతూ మురికి వాడల అభివృద్ధికి పశ్చిమ నియోజక వర్గం ఎమ్మెల్యే గణబాబు చర్యలు చేపట్టా రని అన్నారు. అందులో బాగంగా నేడు మురికి వాడల్లో నివశిస్తున్న ప్రజలకు పక్క ఇల్లు నిర్మిచే విదంగా ఇంటి నిర్మాణ మంజూరు పత్రాల అంద జేయడం జరిగిందన్నారు .కార్యక్రమంలో బాగంగా 195 మంది స్థానిక నివసితులకు మంజూరు పత్రాలను అందజేశామని అన్నారు. కార్యక్రమంలో టీడీపి నాయకులు మళ్ల శంకరరావు, పెంటకోట ఈశ్వరరావు, జోగినాయుడు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 23వ రోజుకు చేరిన టీడీపీ రిలే నిరసన

యలమంచిలి రూరల్ : ప్రత్యేక హోదా కోసం టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు మంగళవారంతో 23వ రోజుకు చేరుకుంది. రిలే దీక్షలకు అనేక మంది మద్దతు ప్రకటిస్తూ దీక్షల్లో కూర్చుంటున్నారు. ప్రత్యేక హోదాతోపాటు విభజన చట్టంలోని అంశాలను అమలు చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. అలాగే టీడీపీ చేపట్టిన దీక్షలకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ కొఠారు సాంబ అన్నారు. ఇప్పటికైనా కేంద్రం దిగొచ్చి ప్రత్యేక హోదా ప్రకటించాలని కోరారు. దీక్షల్లో ఆడారి శ్రీధర్, మళ్ల కొండబాబు, బోదెపు సాయిరాం, మళ్ల చినసాంబ, ఆడారి రమణ, యారాడ చినబాబు, నడిగట్ల నాగేశ్వరరావు, యారాడ నాగేశ్వరరావు ఉన్నారు.

# మహిళలపై అత్యాచారాలను అరికట్టాలి

## దళితులకు రక్షణ కల్పించాలి




గాజువాక : దేశంలో జరుగుతున్న మహిళ లపై అత్యాచారాలను అరికట్టాలని, దళితు లకు రక్షణ కల్పించాలని గాజువాక నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మంగళవారం పాదయాత్రను నిర్వహించారు. అనంతరం గాజువాక ప్రధాన కూడలిలో క్రొవ్వుత్తుల ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త మంత్రి రాజశేఖర్ మాటా ్లడుతూ దేశంలో దళితులపై, మహిళలపై అత్యాచారాలు, ఆరాచకాలు జరుగుతున్న భాజపా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ద్వజమెత్తారు. సామాన్యు లకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసారు. జమ్మూకాశ్మీర్‌లోని కరువా జిల్లాలో 8సం. బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తులను తక్షణమే శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. భాజపా ప్రభుత్వంలో మైనార్టీలకు దళితులకు రక్షణ కరువైందని రానున్న కాలంలో భాజపా ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్‌పార్టీ అండగా ఉంటుందని, న్యాయం జరిగేవరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు గుడివాడ అమ్మన్న, మహిళలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మైక్యూర్ హాస్పిటల్స్‌నందు కాడావేర్ ప్రొసీజర్

## ఒక మరణం ఐదుగురికి ప్రాణదానం




విశాఖపట్నం : జీవిస్తూ అమరత్వాన్ని మనం సాధించలేం కానీ మరణించిన తరువాత మనం దాన్ని సాధించగలం... అన్నది నానుడి. ఈ తరహా కథ బొబ్బిలి మండలం , పరిధిలో 38 సంవత్సరాల వయసున్న రైతు , శ్రీ సారిక రామకృష్ణది. తన జీవితంలో వినాశకర సంఘటన జరుగక ముందు వరకూ తన జీవితము భార్య సారిక రాధమ్మ మరియు ఇద్దరు పిల్లలు శరణ్య , దినేష్ కుమార్లతో సంతోషకరం గా గడిపారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సారిక రామకృష్ణను మైక్యూర్ హాస్పిటల్స్ , విశాఖపట్నంకు తరలించారు. ఆయనకు సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ టీ. సురేష్ చికిత్స నందిస్తూ సారిక రామకృష్ణ బ్రెయిన్ డెడ్ అయినట్లు ప్రకటించారు. విషాదం అలుముకున్న ఈ పరిస్థితిల్లో సైతం సారిక రామకృష్ణ కుటుంబం మానవత్వం ప్రదర్శించింది. సారిక రామకృష్ణ అవయవాలను దానం చేయాలన్న వారి నిర్ణయం ఐదుగురి ప్రాణాలను కాపాడింది. నేడు సారిక రామకృష్ణ యొక్క అవయవాలు అయిదుగురుకు నూతన జీవితాన్ని ప్రసాదించాయి, అతని కాలేయము , రెండు కిడ్నీలు మరియు రెండు కన్నులు దానం చేసారు. అతి చిన్న జిల్లా నుంచి వచ్చినప్పటికీ మహోన్నత కార్యక్రమం చేయడానికి ముంచుకు రావడమనేది మన దేశంలో అవయవదానం పట్ల పెరుగుతున్న ప్రజాధారణ, ప్రాముఖ్యతకు అద్దం పడుతుంది. ఏప్రిల్ 16 , 2018 వ తేదీన శ్రీ సారిక రామకృష్ణను బ్రెయిన్ డెడ్ గా ప్రకటించిన అనంతరం ఆయన కుటుంబ సభ్యులు అతని కాలేయము , రెండు కిడ్నీలు మరియు రెండు కన్నులు ప్రభుత్వ కార్యక్రమమైనా జీవన్ దాన్ ద్వారా దానం చేశారు. ఒక కిడ్నీని మైక్యూర్ హాస్పిటల్స్, విశాఖపట్నం వద్ద డాక్టర్ పీ. శ్రీ రామ్ నవీన్ , కన్సల్టెంట్ నెఫ్రోలోజిస్ట్ మరియు అతని బృందం మార్పిడి చేసింది. ఇతర అవయవాలను ఇతర హాస్పిటల్స్ కు జీవందాన్ కార్యక్రమం ప్రోటోకాల్ అనుసరించి పంపిణీ చేశారు. ప్రజలలో పెరుగుతున్న అవయధనములపై అవగాహన, ప్రజాచైతన్యానికి నిదర్శమని సీనియర్ నెఫ్రోలోజిస్ట్ డాక్టర్ పి. శ్రీ రామ్ నవీన్ మరియు కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ టి. సురేష్ అభిప్రాయపడ్డారు.

# మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



కంచరపాలెం : జివిఎంసి 39 వ వార్డు పరిది బిర్లా కూడలి సేవ మార్గంలో మాధవధార జివిఎంసి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈమేరకు నేటినుండి జూన్ 15 వ తేది వరకు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 వరకు చలివేంద్రం కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ సనపల బంగరురాజు పర్యవేక్షించారు . సభ్యులు సనపల పాండు రంగారావు, రాము, మాధవ్ పూర్వ విధ్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## క్రీడల్లో మన దేశ ఘనత

ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో మన ఆటగాళ్ళు ఉత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి దేశాన్ని మూడోస్థానంలో నిలబెట్టడం అభినందనీయం. మన ఆటగాళ్ళు అరువై ఆరు పతకాలు సాధిస్తే, అందులో 26 స్వర్ణాలు, ఇరువై రజతాలు, మరో ఇరువై కాంస్య పతకాలు. 2010లో సొంత గడ్డమీద ఆడిన క్రీడలను మినహాయిస్తే, మన దేశం ఇంగ్లండ్, ఆస్ట్రేలియా తర్వాత మూడోస్థానంలో నిలువడం ఇదే మొదటిసారి. 2002లో మాంచెస్టర్‌లో జరిగిన క్రీడల్లో 30 స్వర్ణాలతో సహా 69 పతకాలు సాధించిన ఘనత మన దేశానికి ఉన్నది. కానీ అప్పుడు మన దేశానికి నాలుగో స్థానమే దక్కింది. నాలుగేండ్ల కిందట గ్లాస్గోలో 64 పతకాలు సాధించి మన దేశాన్ని ఐదో స్థానంలో నిలిపిన ఆటగాళ్ళు ఈసారి కెనడాను వెనక్కినెట్టి మూడోస్థానంలో నిలుపడం క్రీడాభిమానులకు సంబురాన్ని కలిగించింది. గ్లాస్గోలో జరిగిన క్రీడలతో పోలిస్తే మన దేశానికి అదనంగా పెరిగింది రెండు పతకాలే కావచ్చు. కానీ ఈసారి గెలుచుకున్న 66 పతకాల్లో స్వర్ణాలు అధికంగా ఉన్నాయి. అప్పుడు మన క్రీడాకారులు పదిహేను స్వర్ణాలు గెలుచుకుంటే, ఈసారి పదకొండు అధికంగా మొత్తం 26 స్వర్ణాలు తెచ్చుకున్నారు. దీన్నిబట్టి క్రీడల్లో ఉన్నత ప్రమాణాలు ప్రదర్శించినట్టు తెలుస్తున్నది. దేశానికి పతకాలు సాధించిపెట్టిన ఆటగాళ్ళలో సీనియర్లతో పాటు టీనేజర్లు కూడా ఉండటం విశేషం. 15 ఏండ్ల వయసులోనే షుటింగ్‌లో స్వర్ణం సాధించిన అతి పిన్నవయసు భారతీయుడిగా మనీశ్, రిటైర్మెంట్ పక్కనబెట్టి మళ్లీ రెజ్లింగ్ బరిలోకి దిగి స్వర్ణం సాధించిన సుశీల్, టేబుల్ టెన్నిస్‌లో 4 పతకాలు సాధించిన మనికా బాత్రా, బరిలోకి దిగిన ప్రతి రెజ్లర్ ఏదో ఒక పతకంతో తిరిగిరావడం మన క్రీడాకారుల అత్యుత్తమ ప్రదర్శనకు నిదర్శనం. ఈ క్రీడలలో అత్యధిక పతకాలను అందించింది షుటర్లే. 15 ఏండ్ల అనీశ్ 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో స్వర్ణం గెలిచి రికార్డు నెలకొల్పాడు. అద్భుత ఫాంలో ఉన్న యువ మనుబాకర్ సహా సీనియర్లు జీతూరాయ్, హీనాసి ధ్ధు స్వర్ణాలతో మెరుపులు మెరిపించారు. రెజ్లింగ్ లో సుశీల్‌కుమార్ ప్రతిభ అబ్బురపరిచేదే. ఫైన ల్లో ప్రత్యర్థిపై విరుచుకుపడి కేవలం 80 సెకన్లలోనే మట్టికరిపించి దేశానికి పసిడి పతకం అందించాడు. మానికా బాత్రా పోటీపడిన అన్ని విభాగాల్లోనూ పతకాలు సాధించింది. మన తెలంగాణ బిడ్డలు ఈసారి కూడా అత్యున్నత ప్రదర్శనతో మురిపించారు. షట్లర్ సైనానె హ్వాల్ బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ టీమ్ విభాగంతోపాటు సింగిల్స్‌లోనూ స్వర్ణపతకాలను కైవసం చేసుకొని గర్వకారణంగా నిలిచింది. కామన్వెల్త్ క్రీడల్లో రెండు వ్యక్తిగత స్వర్ణాలు గెలిచిన తొలి భారత షట్లర్‌గా సైనా రికార్డు సృష్టించింది. నిజామాబాద్ బాక్సర్ హుసాముద్దీన్ మహ్మద్ క్రీడలలో తొలిసారే కాంస్యంతో సంచలనం సృష్టించాడు. బ్యాడ్మింటన్‌లోనైతే మనోళ్లదే పూ ర్తి ఆధిపత్యం. మిక్స్‌డ్‌టీం విభాగంలో పసిడితో మొదలుపెట్టిన షట్లర్లు పురుషుల, మహిళల సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో సత్తాచా టారు. మహిళ సింగిల్స్‌లో స్వర్ణం, రజతం మనకే దక్కాయి. మహిళ డబుల్స్‌లో తెలంగాణకు చెందిన సిక్కిరెడ్డి, అశ్విని పొన్నప్ప జోడీ కాంస్యం అందుకున్నది.

మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లో భారత్ స్వర్ణం గెలుచుకోవడంలోనూ మన అమ్మాయిలు సైనా, సిక్కిరెడ్డి, అశ్విని పొన్నప్పలదే కీలకపాత్ర. మన రాష్ట్రానికి చెందిన జిమ్నాస్ట్‌లు అరుణారెడ్డి, మేఘనారెడ్డి వ్యక్తిగత కోచ్‌లకు అక్రెడిటేష న్ ఇవ్వకుండా ఐవోఏ వివక్ష చూపడం వారి ఆటతీరుపై ప్రభావం చూపింది. తెలంగాణ ప్రభు త్వం ఇద్దరు క్రీడాకారిణులు కామన్వెల్త్ పోటీలకు తమ వెంట శిక్షకుల్ని తీసుకువెళ్లేందుకు అయ్యే ఖర్చులన్నీ భరిస్తామన్నది. అయినా కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖ, సంబంధిత క్రీడా సంస్థ పట్టించుకోలేదంటే మన క్రీడావ్యవస్థలో ఉదాసీనత ఎంతగా పేరుకుపోయి ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. మన సైనా క్రీడలను బహిష్కరిస్తా అన్న రీతిలో హెచ్చరిక జారీచేస్తే తప్ప ఆమె తండ్రికి అక్రెడిటేషన్ మంజూరుచేయలేదు. ఈ క్రీడలలో భారత క్రీడాకారులు ఇద్దరు సిరంజీల వాడకం నిషేధం నిబంధనను ఉల్లంఘించిన కారణంగా బహిష్కరణకు గురికావడం బాధాకరం. మన దేశం కామన్వెల్త్ క్రీడల్లో సాధించిన పతకాలలో సగానికి పైగా రెజ్లింగ్, షుటింగ్, వెయిట్ లిఫ్టిం గ్, టేబుల్ టెన్నిస్ నుంచి సాధించినవే. షుటింగ్‌లో చైనా, కొరియన్లు ఘనాపాటీలు. వెయిట్ లిఫ్టింగ్‌లో కూడా మీరాబాయి చాను తప్పితే, మిగతావారిపై పెద్దగా భరోసా పెట్టుకోలేమనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఇటీవలి కాలంలో ఆసియా క్రీడల్లో టేబుల్ టెన్నిస్ నుంచి మన దేశం ఒక్క పతకాన్ని కూడా గెలువలేకపోయింది.

## గేల్ మెరుపుల వెనక అశ్విన్ ఆలోచన

మొహాలి: కనీస ధర రూ.2 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన వెస్టిండీస్ విధ్వంసకారుడు క్రిస్‌గేల్ ఫామ్‌లోకి రావడంతో పట్టరాని ఆనందంతో ఉంది కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్టు. మొహాలి వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గేల్ 33 బంతుల్లో 63 పరుగులు చేశాడు. వరుస సిక్సర్లతో మైదానాన్ని హోరెత్తించాడు. దీంతో అతడు ఔటయ్యే వరకు చెన్నై ఇబ్బంది పడుతూనే ఉంది. ఏడాదికి పైగా ఫామ్‌లో లేని గేల్‌ను చెన్నై మ్యాచ్‌లోనే ఆడించడానికి ఓ కారణం ఉందని పంజాబ్ సారథి రవిచంద్రన్ అశ్విన్ తెలిపాడు.

చెన్నై సూపర్ కింగ్స్ బౌలింగ్ అంటే క్రిస్‌గేల్ ఇష్టపడటమే కారణమని అశ్విన్ పేర్కొన్నాడు. వారి బౌలింగ్ ఎటాక్ అంటే గేల్‌కు ఇష్టం. ఈ రోజు తనను తాను ఆవిష్కరించుకోవడానికి ఇదో చక్కని అవకాశం అని నాకనిపించింది.

ప్రత్యర్థి బౌలింగ్ సైతం అనుకూలంగా ఉండటం కలిసొచ్చింది. మా వ్యూహం పక్కగా పనిచేసింది అని అశ్విన్ అన్నాడు.

గతంతో పోలిస్తే పంజాబ్ మంచి ప్రదర్శనలు చేస్తుండటంతో ఆ జట్టు మేనేజ్‌మెంట్ సంతోషంగా ఉంది.

## సైనా, సింధు గేమ్ ఎంతో ఆసక్తిగా సాగింది!

### బ్యాడ్మింటన్ కోచ్ గోపీచంద్



హైదరాబాద్: బృంద స్ఫూర్తితో కామన్వెల్త్ క్రీడల్లో విజయం సాధించామని బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నారు. ఇంతటి విజయం లభిస్తుందని తాను అనుకోలేదన్నారు. క్రీడాకారుల విజయంపై ఆనందం వ్యక్తంచేసిన ఆయన వారందరికీ అభినందనలు తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. గతంలో కంటే ఈసారి అందరూ మంచి ప్రతిభ కనబర్చారన్నారు. సైనా నెహ్వాల్, పీవీ సింధు గేమ్ ఆసక్తిగా సాగిందని గుర్తుచేసుకున్నారు.

అనంతరం పతకాలు సాధించిన క్రీడాకారులు తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా సైనా నెహ్వాల్ మాట్లాడుతూ.. మంచి జట్టులో భాగస్వామ్యమైనందుకు తానకెంతో సంతోషంగా ఉందన్నారు. డబుల్స్‌లో ఉత్తమ ఆటతీరు కనబర్చిన వారందరికీ అభినందనలు తెలిపారు. విశ్రాంతి లేకుండా కష్టపడ్డానని, ఏడాదిన్నర తర్వాత తాను సాధించిన తొలి పతకం ఇదేనన్నారు. రెండు వారాల పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆడినట్టు చెప్పారు. రెండు స్వర్ణాలు సాధించిన బృందంలో తాను భాగస్వామ్యం అయినందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.

గోపీ చంద్ తమనెంతగానో ప్రోత్సహించారని, ఆయనకు శుభాకాంక్షలు చెప్పారు.

కామన్వెల్త్‌లో ఇద్దరు భారతీయులు తుదిపోరులో తలపడటం గర్వకారణమని పీవీ సింధు అన్నారు. దేశానికి ఆడుతున్న విషయాన్ని గుర్తుంచుకోవాలని గోపీచంద్ సూచించేవారని సింధు గుర్తుచేసుకున్నారు. ఆటలో ఎప్పుడూ ప్రత్యర్థులమేనని, సైనా కూడా అలాగే అనుకుందని అన్నారు. తుదిపోరులో ఎవరు ఒకరే గెలుస్తారని, తామిద్దరి మధ్య మాత్రం మంచి గేమ్ జరిగిందని తెలిపారు.

కామన్వెల్త్ ఆట వల్ల చాలా ఆనందంగా ఉన్నానని కిదాంబి శ్రీకాంత్ అన్నారు. ఏకధాటిగా పది రోజులు ఆడటం చాలా కష్టమని, మూడో గేమ్‌లో ఇంకా బాగా ఆడితే బాగుండేదని అన్నారు. తుదిపోరులో చేసిన పొరపాట్లను మళ్లీ పునరావృతం కానివ్వనని చెప్పారు.

## మోదీ అపాయింట్‌మెంట్ కోరిన స్టాలిన్



చెన్నై: కావేరీ మేనేజిమెంట్ బోర్డు ఏర్పాటు ఆవశ్యకతను వివరించేందుకు తమకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని ప్రధాని మోదీని డీఎంకే అధ్యక్షుడు ఎం.కె.స్టాలిన్ కోరారు. ఈ మేరకు మోదీకి ఆయన ఓ లేఖ రాశారు. కావేరీ జల వివాదాన్ని వివరించేందుకు రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, వాణిజ్య, కార్మిక వర్గాల తరపున తమకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని ఆ లేఖలో స్టాలిన్ కోరారు. తమిళ ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని కావేరీ మేనేజిమెంట్ బోర్డు ఏర్పాటుపై తక్షణం ప్రధాని జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆరువారాల్లోగా సీఎంబీ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు కేంద్రానికి ఇచ్చిన ఆదేశాన్ని ఈ సందర్భంగా స్టాలిన్ గుర్తు చేశారు. తమిళనాడు ముఖ్యమంత్రి కె.పళనిస్వామి అధ్యక్షతన జరిగిన అఖిల పక్ష సమావేశంలోనూ మూడు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారని, ప్రధానిని కలిసి పరిస్థితిని వివరించి సీఎంబీ ఏర్పాటు విషయంలో జోక్యం కోరాలన్న తీర్మానం కూడా అందులో ఒకటని ఆయన పేర్కొన్నారు. దీనికి అదనంగా సీఎంబీ తక్షణం ఏర్పాటు చేయాలంటూ మార్చి 15న తమిళనాడు అసెంబ్లీ ఎకగ్రీవ తీర్మానం చేసిందన్నారు. ఈ తీర్మానం ఏడున్నర కోట్ల తమిళ ప్రజల మనోభావాలకు అద్దంపడుతోందని స్టాలిన్ ప్రధానికి వివరించారు. 'ఏతావాతా, మేము మీ అపాయిమెంట్ కోరుతున్నాం. తమిళనాడుకు చెందిన లీడర్లంతా రాష్ట్రంలో వ్యవసాయ సంక్షోభాన్ని మీకు వివరించాలనుకుంటున్నారు' అని స్టాలిన్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టులో దాఖలు చేసిన క్లారిఫికేషన్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవాల్సిందిగా కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖను తక్షణం ఆదేశించాలని ప్రధానిని ఆ లేఖలో స్టాలిన్ కోరారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల వరకూ వేచిచూడకుండా సీఎంబీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## చైనా సరిహద్దుల్లో భారత వాయు సేన భారీ విన్యాసాలు

న్యూఢిల్లీ : పొరుగు దేశాల నుంచి ఎదురయ్యే అవకాశం ఉన్న ముప్పును దృష్టిలో ఉంచుకుని భారత వాయు సేన దేశవ్యాప్తంగా గగన్ శక్తి పేరుతో భారీ విన్యాసాలు నిర్వహిస్తోంది. అనేక దశాబ్దాల తర్వాత పెద్ద ఎత్తున విన్యాసాలు జరగుతుండటం విశేషం. రెండు వారాల పాటు జరిగే ఈ విన్యాసాలు ఈ నెల 8న ప్రారంభమయ్యాయి, ఈ నెల 22 వరకు కొనసాగుతాయని విశ్వసనీయ సమాచారం. గగన శక్తిలో భాగంగా మంగళవారం ఉత్తరాఖండ్‌లోని ఉత్తర కాశి జిల్లాలో విన్యాసాలు జరిగినట్లు తెలుస్తోంది. దీనిపై భారత వాయు సేన అధికారిక సమాచారం వెల్లడించలేదు. వాయు సేన అధికారులు మీడియాకు దూరం పాటిస్తున్నారు. అయితే ఈ విన్యాసాల్లో ఈ ప్రాంతంలో వ్యూహాత్మక సన్నద్ధతను పరీక్షించినట్లు సమాచారం.

## కవి సమయం

### సమస్యలు

మానవ మస్తిష్కం ఆందోళనలు, ఆవేదనలు
ఆలోచించకపోతే ఏమీ లేదు
ఆలోచిస్తే అన్నీ సమస్యలమయం
రాజకీయ, ఆర్థిక, విద్య, వైద్యరంగాలు
ఏదైతేనేమి అన్ని రంగాలు అస్తవ్యస్తం
నిరాశ నిస్పృహలు, సమస్యల వెతలు
బడా పరిశ్రమల ధాటికి చిన్న పరిశ్రమలు క్లోజ్
ప్రైవేటు పాఠశాలలు మూతబడ్డాయి
ప్రైవేటు, కార్పొరేటు వైద్యాలయాలు
ధనవంతులకు అందుబాటు, బడుగులకు దూరం
ప్రభుత్వ ఆసుపత్రులులో మందులు కొరత
డాక్టర్ల నిర్లక్ష్యం రోగుల ప్రాణాలు హరీ
ప్రశ్నిస్తే, నిలదీస్తే అరెస్టులు కేసులు
'మేడే'లు వస్తుంటాయి, పోతుంటాయి
కార్మికులకు రక్షణ కరువైన కార్మిక చట్టాలు
గ్యారంటీలేని కార్మికుల జీవితాలు
ఉపాధి దొరకని వలస కూలీలు
పాలక పార్టీలు కిరాయి కార్యకర్తలుగా మారారు
ఎటుచూసినా పేదల జీవితం అంధకారమే.

... కవితా రచన
తుంపాల శ్రీరామమూర్తి
సెల్ నెం : 9440260280

## పంచాంగం

మాసం : చైత్ర ; తిథి :తదియ రా.3.23; కృత్తిక రా.తె.2.19; మ.వ.2.47ల 4.19 | బుధవారం 18-04-2018

a **మేషం** : పెద్దల ఆరోగ్య సమస్యలను అశ్రద్ధ చేయరాదు. బ్యాంకు వ్యవహారాలు అనుకూలిస్తాయి. పెద్దల ఆరోగ్యం గురించి ఆందోళన చెందుతారు. విద్యార్థులకు ప్రింటింగ్ రంగాలవారికి సదావకాశాలు లభిస్తాయి. కాంట్రాక్టర్లకు నూతన టెండర్ల విషయంలో పునరాలోచన అవసరం. బంధువులను కలుసుకుంటారు. b **వృషభం:** కోర్టు వాదోపవాదాల్లో ప్లీడర్లకు గుర్తింపు లభిస్తుంది. ఉద్యోగస్తులు, ఒత్తిళ్ళు, ఆకర్షణలకు దూరంగా ఉండటం అన్నివిధాలా క్షేమదాయకం. మీ శ్రీమతి సూటిపోటి మాటలు అసహనం కలిగిస్తాయి. దైవ సేవా కార్యాక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. అనుకోకుండా నిరుద్యోగుల యత్నాలు ఒక కొలిక్కి రాగలవు. c **మిథునం** :బ్యాంకు వ్యవహారాల్లో అపరిచిత వ్యక్తుల పట్ల మెళకువ అవసరం. వీలైనంతవరకు మీ పనులు మీరే చూసుకోవటం ఉత్తమం. ఆదాయాన్ని కన్నా ఖర్చులు అధికంగా ఉంటుంది. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునారాలోచన మంచిది. విద్యార్థినులకు ఒత్తిడి ఆందోళనలు ఎదుర్కొంటారు. d **కర్కాటకం**:వ్యాపారవేత్తలు ప్రస్తుత పరిస్థితిని కొనసాగ నివ్వడం మంచిది. ప్రముఖులను కలుసుకుంటారు. ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు రాణింపు లభిస్తుంది. ప్రింటింగ్ రంగాలవారికి సదవకాశాలు లభిస్తాయి. మీ సంతానం మొండివైఖరి మీకెంతో చికాకు కలిగిస్తుంది. హామీలు చెక్కుల జారీల్లో ఏకాగ్రత వహించండి. e **సింహం** :విద్యార్థులు తోటి విద్యార్థులతో విందులు, వేడుకలలో పాల్గొంటారు. అవసరానికి సరిపడ ధనం సమకూరుట వల్ల ఆర్థిక ఇబ్బంది అంటూ ఏదీ ఉండదు. మీ అవసరాలకు కావలసిన ధనం సమయానికి సర్దుబాటు అవుతుంది. ప్రైవేట్ ఫైనాన్సు సంస్థలో పొదుపు చేయటం మంచిది కాదని గమనించండి. f **కన్య** : పెద్దల జోక్యంతో అనుకోకుండా ఒక సమస్య సానుకూలమవుతుంది. పంతాలకు పోకుండా బంధువులతో ఆదరంగా మెలగండి. బంధుమిత్రుల కలయికతో ఉత్సాహం చోటుచేసుకుంటుంది. దంపతుల మధ్య మనస్పర్థలు తలెత్తుతాయి. స్త్రీలకు షాపింగ్ విషయాలలో అపరిచిత వ్యక్తులపట్ల మెళకువ అవసరం. g **తుల** : ఆత్మీయుల నుంచి అందిన ఆహ్వానం మిమ్ములను ఇరకాటానికి గురిచేస్తుంది. విలాసవస్తువులు అమర్చుకోవాలనే స్త్రీల కోరికలు నెరవేరుతాయి. చేతి వృత్తులు, చిరు వ్యాపారులకు అన్నివిధాలా కలిసివస్తుంది. ప్రయాణాలలో ఇబ్బందులు తలెత్తుతాయి. నిరుద్యోగలకు రాతపరీక్షలు, ఇంటర్వ్యూలు సత్ఫలితాలనిస్తాయి. h **వృశ్చికం** : పాత మిత్రులను కలిసి వారికి శుభాకాంక్షలు అందజేస్తారు. నూతన పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. ఉద్యోగస్తులకు పైఅధికారుల నుంచి మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. నూతన వస్త్రప్రాప్తి ప్రముఖుల కలయిక ప్రయోజనకరంగా ఉంటుంది. రుణ విముక్తులు కావడంతో మానసికంగా కుదుటపడతారు. i **ధనుస్సు** :రాజకీయ నాయకులు పార్టీ సభ్యులతో కలిసి విందు, వినోదాలలో పాల్గొంటారు. సంఘంలో మీ స్థాయి పెరుగును. పెద్దల ఆరోగ్యం కుదుటపడుతుంది. వ్యాపారరీత్యా దూరప్రయాణాలు చేస్తారు. j **మకరం** :ఆర్థికంగా ఎదగాలనే మీ ఆశయం నిదానంగా ఫలిస్తుంది. కుటుంబీకులతో కలిసి విందులు, వినోదాలు, సమావేశాలు ఉల్లాసంగా కలిగిస్తాయి. దైవ, పుణ్య, సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి కనబరుస్తారు. నూతన వస్తువులను కొనుగోలు చేస్తారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేస్తారు. ధనం చేతిలో నిలబడటం కష్టమే. k **కుంభం** : విద్యార్థులకు హడావుడి, తొందరపాటు తగదు. వస్త్ర, బంగారం, వెండి, లోహ వ్యాపారస్తులకు సంతృప్తి కానవస్తుంది. విందు, వేడుకలలో చురుకుగా పాల్గొని అందరిని ఆకర్షిస్తారు. కళ, క్రీడా, సాంకేతిక రంగాలవారికి ప్రోత్సాహకరం. నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు, రాత పరీక్షలలో మెళకువ, ఏకాగ్రత అవసరం. L **మీనం** : విందులలో పరిమితి పాటించండి. వాహనం ఇతరులకు ఇచ్చిఇబ్బందులను ఎదుర్కొంటారు.

## కుజదోష నివారిణి అపర్ణాదేవి

### సంకీర్తన



ఓ మహాత్మా! అపర్ణ వ్రతమును ఏ విధముగా చేయవలెను, అందుకు విశేషమైనటువంటి పర్వదినములు ఏమైనా కలవా? ఈ వ్రతమునందు ఏ దేవతను పూజింపవలయును? ఏ విధముగా పూజ చేయవలయును? ఈ వ్రతము చేసిన వచ్చు ఫలమేమి? అని ఋషులు కోరగా సూతమహర్షి ఈ విధముగా చెప్పుచున్నాడు.

శ్రీ అపర్ణా వ్రతము చేయు మానవులు ముందుగా విఘ్నేశ్వర పూజను ఆచరించి, మండపమును ఏర్పరిచి, కలశయందు వరుణదేవుని పూజించి, ప్రతిమారూపిణిగా అపర్ణాదేవిని పూజింపవలెను. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు వైదికముగాను, శూద్రులు పురాణోక్తముగాను, ఈ కల్పములో చెప్పబడిన విధముగా పూజించి ప్రత్యేకముగా క్షీరాన్నము నివేదన గావించి, పూజ పూర్తిచేసి శ్రీ అపర్ణా వృత్తాంతము, కుజ జన్మ వృత్తాంతమును పఠింపవలెను. ఈ ప్రకారము చైత్ర మాసములో కాని, శ్రావణ, ఆశ్వీయుజ, కార్తీక, మాఘ మాసములందు గాని, ఈ వ్రతమును ఆచరించవలెను.ముఖ్యముగా ఈ వ్రతమును ఆచరించు భక్తులు ఏ మాసముల యందైనను మంగళ, శుక్రవారముల యందు శ్రీ అపర్ణాదేవిని పూజించుట విశేషము. కుజదోషము ఉన్న వివాహము కాని వారు, సంతానము లేనివారు మంగళవారము పూజించుట విశేషము. మరియు ఋణ, శత్రుబాధల నుండి విముక్తి కొఱకు మంగళవారము పూజింపవలెను.

**మంగళ లేక శుక్రవారం:** అపర్ణా అమ్మవారి ఆలయం ఆంధ్రప్రదేశ్‌లో తూర్పుగోదావరి జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి అను గ్రామములో కలదు. ఈ గ్రామం అన్నవరం పుణ్యక్షేత్రానికి 20 కి.మీ దూరంలో, సామర్లకోటకు 25 కి.మీ దూరంలో, కాకినాడకు 30 కి.మీ దూరంలో కలదు. శ్రీ అపర్ణాదేవిని శుక్రవారము పూజించినచో విద్యార్థులకు విద్యాలాభము, వ్యాపారులకు ధనలాభము, స్త్రీలకు సౌభాగ్య సంపదలను, పురుషులకు సకల కార్యసిద్ధిని చేకూర్చును.

ఈ వ్రతమును ఏడు మంగళవారములు గాని, ఏడు శుక్రవారములు గాని పూర్తిచేసి ఏడుగురు ముత్తైదువులకు వస్త్ర, దక్షిణ తాంబూలాదులు, శ్రీ అపర్ణా వ్రతకల్ప పుస్తకముతో వాయనమిచ్చి వారిచే ఆశీర్వచనము పొందవలెను.

ముఖ్యముగా ఈ వ్రతము ఆచరించువారు ప్రారంభమునందు గాని, మధ్యలో గాని, చివరి వారము నందు గాని, తాళ్లపురం(తాటిపర్తి)లో వేంచేసియున్న అపర్ణాదేవిని సందర్శించి, పూజించుకొనవలెను. ఈ ప్రకారము శ్రద్ధ, భక్తి విశ్వాసములతో ఎవరు ఈ వ్రతమును ఆచరిస్తారో వారికి అపర్ణాదేవి అనుగ్రహముచేత సకల కార్యములు సిద్ధించు యే గాక, బ్రతికియున్నంత కాలము ధనము, పుత్రపౌత్రికలు కలిగి సమస్తమైన ఐశ్వర్యములను అనుభవించి అంత్యమున దేవి సాన్నిధ్యము పొందుదురు. కలియుగమున వాంఛ సిద్ధి కలిగించుటకు, కుజదోష నివృత్తికి ఇంతకంటే సులభమైన వ్రతము మరొకటి లేదని సూతుడు శౌనకాది మహర్షులకు చెప్పెను. శ్రీ అపర్ణాదేవి అమ్మవారి వ్రతమును ఈ క్రింది కారణాల కోసం ఆలయములో కాని, ఇంటి వద్ద కాని చేసుకొన వచ్చును.

1. కుటుంబ సౌఖ్యము కొరకు (శుక్రవారం ఉ.10.30 గం. నుండి 12.00 గం. రాహుకాలమందు) 2. కుజగ్రహదోష నివృత్తికి, వివాహాలు కుదురుటకు (మంగళవారములయందు) 3. రాహు, కేతు గ్రహదోష నివృత్తికి (శుక్రవారం ఉ.10.30 గం. నుండి 12.00 గం. రాహుకాలమందు లేదా మంగళ వారములయందు) 4. ఋణ బాధలు తొలగుటకు (మంగళవారములయందు) 5. ఉద్యోగం పొందుటకు, పదోన్నతులు, బదిలీలకు (అష్టమితో కూడిన మంగళవారమందు లేదా మంగళవారముల యందు) 6. దాంపత్య సమస్యల నివృత్తికి, సంతానం కొరకు (శుక్రవారములయందు) 7. వ్యాపార వాణిజ్య విషయాలలో చిక్కులు తొలగి ఐశ్వర్యాభివృద్ధికి (శుక్రవారములయందు) 8. ఏ రంగం నందైనను విజయం సాధించడానికి (మంగళవారములయందు) 9. జ్ఞానసముపార్జనకు, తద్వారా మోక్షసాధనకు (శుక్రవారములయందు) చేసుకొనగలరు.ఈ వ్రతమును ఏ మంగళ, శుక్రవారముల నందైనను జరుపుకొనవచ్చును. అష్టమి, చతుర్ధశితో కూడిన మంగళ, శుక్రవారములయందు చేసుకున్నచో విశేష ఫలప్రదము. మీ మీ సౌలభ్యములను బట్టి అమ్మ వారి దివ్యక్షేత్రము నందు ఈ పూజను జరిపించుకొనవచ్చును. మీ సమస్యను బట్టి ఏడు మంగళవారములు కాని, ఏడు శుక్రవారములు కాని ఈ వ్రతమును జరుపు కొనడము మంచిదిగా దైవజ్ఞులు నిర్ణ యిం చారు. మీ ఇంటి దగ్గర అమ్మ వారి పూజను, దివ్య వ్రతమును జరుపు కొనవచ్చును, లేదా జరిపించు కొనవచ్చును. ప్రతీ మంగళవారము ఉదయం 6 గం. నుండి 12 గం. వరకు కుజగ్రహ దోష నివృత్తికి, వివాహాలు కుదరడానికి, మిగిలిన సమస్యలు నివారణకు అమ్మవారి ఆలయంలో కుంకు మార్చనలు, ప్రతీ శుక్రవారము కుంకుమార్చనలు, జరుగును.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## అబివృద్ధిపథం వైపు పరవాడ కొత్తకోలనీ

### కోలనీని పర్యటించిన జడ్పీటిసి పైలా, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు



పరవాడ : మండలం లోని పరవాడ కొత్త కోలనీ లో మంగళ వారం పెందుర్తి నియోజకవర్గ ఇన్ చార్జి బండారు అప్పలనాయుడు, పరవాడ జెడ్పీటీసీ పైల జగన్నాధరావు పర్యటించారు .ఈ సందర్బంగా వీళ్ళు మాట్లాడూతూ కొత్త కోలనీ కి సిసి రోడ్లు, డ్రెయిన్లు నిమిత్తం ఎన్ ఆర్ జి సి మరియు మైనింగ్ గ్రాంట్ నుండి రూ.30లక్షలు నిధులను పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారయణమూర్తి మంజూరు చేసారు. ఈ కార్యక్రమం లో గొర్లివానిపాలెంసర్పంచ్ గొర్లికనకారావు, మండల టిడిపిప్రదానకార్యదర్శిపైల రామచంద్రరావు,పరవాడజన్మభూమి కమిటి సభ్యులు రెడ్డి శ్రీనువాసరావు,బొద్దపు అయ్యబాబు,పైల సీతారాం ,గండి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక తనిఖీల్లో రూ.1.50కోట్లు రికవరీ

కొయ్యూరు : 2017 -18 సామాజిక తనిఖీ రూ.8 కోట్లు బయటపడగా రూ.1.50కోట్లు రికవరీ చేశామని, 92 ఉద్యోగులను ఉద్యోగాల నుండి తొలగించినట్లు ఎన్ఆర్ఇజిఎస్ పిడి కళ్యాణచక్రవర్తి తెలిపారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో అధికారులతో సమావేశానికి వచ్చి అనంతరం విలేకరులతో మాట్లాడారు. సామాజిక తనిఖీలో 80 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను 10 మంది టిఎలను 2 ఏపిఒలను విధులు సరిగా నిర్వర్తించకపోవడం, నిదులు దుర్వినియోగం చేసినట్లు గుర్తించి వారిని తొలగించామన్నారు. 6కోట్ల 50లక్షల నిధులను చట్టబద్ధంగా మిగతా వారి నుండి వసూలు చేస్తున్నామన్నారు. 2018-2019 సంవత్సరానికి 2లక్షల మంది కూలీలకు జిల్లాలో పని దినాలు కల్పించడానికి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎన్ఆర్ఇజిఎస్ నిధుల నుండి బాలికల పాఠశాలలకు ప్రహరీలు నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే కూలీలకు ఎండాకాలంలో మజ్జిగ పంపిణీ చేయాలని ఆదేశాలు వచ్చాయన్నారు. ఫిబ్రవరి నెలలో 20శాతం, మార్చి నెలలో 25శాతం, ఏప్రిల్ నెలలో 30శాతం, మే నెలలో 30శాతం జూన్ నెలలో 25శాతం అదనపు కూలీలకు ఇవ్వనున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిడి రవంద్ర, ఏపిఒ కొండబాబు, ఎంపిడిఒ ఇమ్మానుయేల్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



భీమునిపట్నం : తగరపువలస డివిజన్ 12వ వార్డ్‌లో నియోజకవర్గ ఇన్ చార్జ్ చిక్కాల విజయబాబు సుమారు 19.5 లక్షలతో సి.సి.రోడ్స్, కాలువలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమం లో తగరపువలస టి.డి.పి డివిజన్ అద్యక్షులు కొప్పల రమేష్,రవ్వ.వెంకటరావు,కొప్పల కృష్ణ ,చిలకా నరసింగ రావు,జన్మ భూమి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చెత్త నుండి సంపద తయారీ ద్వారా పారిశుధ్యంతో పాటు ఆదాయం

గొలుగొండ : చెత్త నుండి సంపద తయారీతో సంపూర్ణ పారిశు ద్యంతో పాటుగా ఆదాయం కూడా సమకూర్చుకోవచ్చునని జిల్లా మానవవనరుల రిసోర్సు పర్సన్ నర్సింహమూర్తి అన్నారు. మండలంలో గొలుగొండ చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో మంగళవారం డిపిఎంనకు చెందిన గొలుగొండ, నర్సీపట్నం, మాకవరపాలెం, టిపిఎంనకు చెందిన జికెవీధి, చింతపల్లి, కొయ్యూరు మండలాలకు చెందిన మండల సమాఖ్య సభ్యులు వెలుగు సిబ్బందికి చెత్త నుండి సంపద తయారీ, వాటి వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవగాహన ఉంటే చెత్త నుడి ఎరువుల తయారీ అనేది చాలా విజయవంతంగా చేయవచ్చు నన్నారు. గ్రామాల్లో డ్వాక్రా సభ్యులతో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను విజయవంతంగా నిర్వహించడం కోసమే మండల సమాఖ్య పాలకవర్గ సభ్యులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ముందుగా మండల సమాఖ్యలకు తదుపరి గ్రామ సమాఖ్యల సభ్యులకు దశల వారీగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం తడి పొడి చెత్తను సేకరించే విధానం వాటి నుంచి వానపాముల సహాయంతో ఎరువుల తయారీ విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఒపిఆర్‌డి త్రిమూర్తులు, మండల పరిషత్ పరిపాలానాధికారి రవికుమార్, వెలుగు ఏపిఎం రమణకుమారి, సత్తిబాబు, జగన్‌లు ఆరు మండల సమాఖ్యల పాలకవర్గ సభ్యులు, గొలుగొండ సర్పంచ్ పారేపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి రఘురామ్ పాల్గొన్నారు.

# భూమి రికార్డులలో మార్పులను గుర్తించండి

### ఆర్టీవో కె.సూర్యారావు



మాట్లాడుతున్న ఆర్డీవో కె.సూర్యారావు

నర్సీపట్నం : భూమి రికార్డులకు వాస్తవ పరిస్థితులు, గత రికార్డులతో సరిచూసి జిల్లా కలెక్టర్ పంపిన ప్రొఫార్మాలలో వెంటనే సమర్పించాలని ఆర్టీవో కె. సూర్యారావు రెవిన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో 22(ఎ) కార్డులకు సంబంధించి విఆర్‌ఒలు, తహసీల్దార్, ఇతర సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ భూమి జిరాయితీమెట్టు, పల్లం, పోరంబోకు తదితర వివరాలతో కూడిన అనేక వివరాలను పంపించా లన్నారు. చేర్పులు, తొలగింపులు నమోదు చేస్తూ కారణాలను విశదీకరించాలన్నారు. 22ఎ రికార్డు లను ఎస్ఎఫ్‌సి డైగ్లాన్, అడంగల్‌లతో సరిపోల్చుతూ ప్రభుత్వ భూమిగా చూపిన ప్రైవేటు భూమిని గుర్తించా లన్నారు. గ్రామకంఠంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను సబ్‌డివిజన్ (2) నుంచి చూపించి గ్రామకంఠం(1)గా నమోదు చేయాలన్నారు. 22 ఎ లో పొరపాటుగా నమోదైన ప్రైవేటు భూమి, గ్రామకంఠం, దేవాదాయ భూములు డిపట్టాగా నమోదైన జిరాయితీ భూములు, అసైన్డ్ భూమి అయినా, ప్రకటించ బడినప్పటికీ లేదా ఇతర కారణాల మూలంగా నమోదు కానటువంటి సర్వే నెంబర్లు మొదలైన వాటిని గూర్చి పూర్తి వివరాలతో సవివరమైన ప్రొఫార్మా లతో నివేదికలు వెంటనే అందజేయాలని ఆదేశించారు. వీఆర్వోల సందేహాలను నివ అత్తి చేశారు. ఈ సమావేశంలో ఏఒ వి.ప్రకాశ రావు, తహసీల్దార్లు వి.వి.రమణ, కనకారావు, కె.వేణు గోపాల్‌రావు, ఎన్.శ్రీనివాస రావు, భాస్కర్‌రావు, డిప్యూటీ తహ సీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# టీచర్స్ హెల్ప్ గ్రూప్ ఆర్ధిక సహాయం



భీమునిపట్నం : టీచర్స్ హెల్ప్ గ్రూప్ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ పాటశాల విద్యార్థిని అయిన అగ్ని హోత్రుల ప్రణీత ఐదవ తరగతి విద్యార్థినికీ వైద్య ఖర్చుల నిమిత్తం పది వేల రూపాయులు వాళ్ళ తల్లి దండ్రులకు టీచర్స్ హెల్ప్ గ్రూప్ సభ్యులు అందజేసారు. కొంత కాలంగా అనారోగ్యం తో బాధపడుతున్నది ఆమెకు ఆపరేషన్ చెయాలని డాక్టర్స్ సూచించారు

ఆమె తల్లి దండ్రులకు ఆపరేషన్ చేయించే ఆర్థిక స్థోమత లేక పోవడం వారు ఇబ్బంది ల నేపద్యం లో టీచర్స్ హెల్ప్ గ్రూప్ ముందుకు వచ్చింది.ఈ కార్యక్రమంలో టీచర్స్ హెల్ప్ గ్రూప్ గౌరవ అద్యక్షులు కె.ముత్యాలరావు ,ప్రదానోపాద్యులు చిట్టి.సింహాచలం, స్వచ్ఛంద ఉపాద్యాలు జి.పండరీనాద్, శ్యామలాంబ,సుజాతా కుమారి ,రమాదేవి,ఎ.శ్రీను,రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఈవిఎం యంత్రాల పరిశీలన



కంచరపాలెం: జివిఎంసి 40 వ వార్డు పరిది ఆర్ .అండ్ .బి కూడలి వద్ద నున్న ఎఫ్ .సి.ఐ గుడౌన్స్ వద్ద భద్ర పరచిన ఈ .వి.ఎం యంత్రలను మంగళవారం ఉదయం పలు రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో ఎన్నికల ప్రత్యేక అదికారులు ల్యాండ్ భద్రతా తహశీల్దార్ రాజేంద్ర రావు, అర్బన్ తహశీల్దార్ నాగభూషణరావు పరిశీలించారు. ఈ సంద ర్బంగా వారు మాట్లాడుతూ జిల్లా లో ఉన్న 15 నియో జకవర్గాలకు సంబందించి మొత్తం 26 .800 ఈవిఎం యంత్రలను జాతీయ ఎలక్షన్ కమిషన్ రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వార పరిశీలించి ఆన్ లైన్ లో నమోదు చేస్తామని ఈ ప్రక్రియ 10 రోజుల వరకు సాగుతుందని తెలిపారు.

కార్యక్రమంలో ఆర్ .ఐ లు గణేష్, చైతన్య వైసీపి రాష్ట్ర కార్యదర్శి పక్కి దివాకర్ వైసీపి 40 వ వార్డు నాయకులు షేక్ .బాబ్జి , కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోడాదాస్ సుధాకర్ బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి రుణాలకు ధరఖాస్తులు ఆహ్వానం

భీమునిపట్నం : రాష్ట్ర ప్రభుత్వం రాయితీ తో కూడిన స్వయం ఉపాధి యూనిట్ల నిర్వనకు ఇచ్చే రుణాల కోసం ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భీమిలి ఎమ్డీవో కె.హరిప్రసాద్ తెలిపారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బిసీ,కాపు ,వైశ్య, బ్రాహ్మణ, ముస్లీం, క్రైస్తవ మైనారటీ, దివ్యాంగులు,ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారు ధరఖాస్తులు చేసుకోవాలనీ చెప్పారు.

ఈ నెల 30తేదీ లోపు వెబ్ సైట్ లో ధరఖాస్తులు చేసుకోవాలనీ చెప్పారు.

ప్రింట్ అవుట్ ను,సంభందిత ధ్రువపత్రాల నకళ్ళను భీమిలి ఎమ్పీడీవో కార్యాలయానికి ఇవ్వాలని అన్నారు.

# అగ్రిగోల్డ్ బాధితులు డిపాజిట్ సొమ్మును చెల్లించాలని

### డిప్యూటీ తహశీల్ధార్ వినతిపత్రం



డిప్యూటీ తహశీల్ధార్‌కు వినతిపత్రం ఇచ్చిన కార్యవర్గసభ్యులు

సబ్బవరం: అగ్రిగోల్డ్ బాధితుల డిపాజిట్ సొమ్మును తిరిగి చెల్లించుటకు తగిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించి ఆదుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్‌కు ఏజెంట్ వెల్ఫేర్ కార్యవర్గ సభ్యులు చింతల జగన్నాధం, కోరాడ రమేష్, బోకం దేముడుబాబు మంగళవారం డిప్యూటీ తహశీల్ధార్ ఆనంద్‌కుమార్‌కి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల డిపాజిట్‌సొమ్మును వెంటనే చెల్లించాలని కోరారు. రాష్ట్ర హైకోర్టు అనుమతి పొంది అగ్రిగోల్డ్ కంపెనీ ఆస్తులన్నింటిని ప్రభుత్వం విక్రయించి బాధితులకు పూర్తిగా న్యాయం చేయాలని అన్నారు. రాష్ట్రంలో 19.52 లక్షల మందికి రాష్ట్రాలలో మొత్తం 32 లక్షల మంది కంపెనీ ద్రోహం కారణంగా 6,300 కోట్లకు పైగా అసలు మొత్తం కోల్పోయి చాలామంది బాధితులు ఆత్మహత్యలకు గురి అవుతున్నారని అన్నారు. రాష్ట్ర ఉమ్మడి హైకోర్టులో 2 సం॥లకు పైగా నడుస్తున్న కేసు వాయిదాల మీద వాయిదాలు పడుచున్నది. బాధితులకు పరిష్కారం చూపడంలో కాలయాపన జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో వున్న అగ్రిగోల్డ్ బాధితులకు చెల్లించవలసిన 3,965 కోట్లను ప్రభుత్వం అడ్వాన్స్‌గా అందించి బాధితుల పిల్లల విద్య, వైద్య, వివాహ తదితర అవసరాలకు తక్షణమే సొమ్ము చెల్లించాలని కోరారు. ఈనెల 25వతేదీన హైకోర్టు వాయిదా సందర్భంగా ప్రభుత్వం కంపెనీకి చెందిన యావదాస్తులను, విక్రయించటానికి హైకోర్టు నుండి అనుమతి పొందినట్లు అఫిడవిట్ దాఖలు చేసి ఆస్తులు విక్రయించి అగ్రిగోల్డ్ బాధితుల సొమ్ము చెల్లించాలని వారు కోరారు.

జిల్లా ఒక వెరిఫికేషన్ కేంద్రం పెట్టి ఇంకా మిగిలిపోయిన బాధితుల బాండ్లను పరిశీలించి లబ్ధిదారుల జాబితాలో చేర్చాలి అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు మిడతాడ ఈశ్వరరావు, డెక్క అచ్చులు, గవర ప్రసాద్ మరియు అగ్రిగోల్డ్ బాధితులు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ఋణములు కోసం అన్ లైన్ ద్వారా నమోదు చేసుకోవాలి

భీమునిపట్నం : భీమిలి జోన్ పరిధి భీమిలి తగరపువలస ఏరియాలో ఉన్న నిరుద్యోగ యువతీ యవకులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్దేశముల ప్రకారం 2018-2019 సంవత్సరం కు గాను 21 సం.ల నుండి 50సం లోపు యువతీ యవకులకు. రాష్ట్రంలోని బిసీ, ఎస్సీ, ఎస్టీ, కాపు ,వైశ్య, , మైనారటీ కార్పొరేషన్ పదకముల క్రింద ఋణములు మంజూరు చేయబడుచున్నవి సదరు ఋణములు లబ్ది పొందుటకు గాను ఆశక్తి కలిగిన లబ్దిదారులు ఋణములు పొందు నిమిత్తం...

ఈనెల 30 లోపు మీ యొక్క ఆదార్ కార్డ్ ,తెలుపు రేషన్ కార్డ్,కుల ధ్రువపత్రం తీసుకొని అన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని భీమిలి జోనల్ కమీషనర్ బి,సన్యాసినాయుడు కోరారు.

## పశువులకు శస్త్రచికిత్సలో డాక్టర్ ప్రదీప్‌కుమార్ సత్తా



పశువులకు శస్త్రచికిత్సలు, వైద్యం చేస్తున్న ప్రదీప్‌కుమార్

నర్సీపట్నం : పశువైద్య సహాయ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ ప్రదీప్‌కుమార్ పశువులకు శస్త్ర చికిత్సలలో తన సత్తా చాటు తున్నారు. శస్త్రచికిత్స నిపుణులైన ప్రదీప్‌కుమార్ పశువులకు శస్త్ర చికిత్సలు చేసి పశువుల ప్రాణాలను నిలబెడుతున్నారు. మనుషుల ప్రాణాలకు ఎంతో విలువ ఉందో మూగజీవాల ప్రాణం విలువ కూడా అంతే విలువైనవి ఆయన నిరూపి స్తున్నారు. మనుషుల వలే పశు వులకు కూడా ఎముకలు విరిగి పోయినప్పుడు వాటిని అతికి నాలుగు, ఆరు రోజుల కాలవ్యవధిలో వాటిని తిరిగి యధాస్థానానికి తేవడం వల్ల అనేక పశువులు తిరిగి మరలా జీవనం సాగిస్తున్నాయి. దీంతో రైతుల్లో ఆనందం వెల్లువెల్లుతుంది. ఈ ప్రాంతంలోని వేములపూడి ఆసుపత్రిలో తరచూ పశువులకు శస్త్ర చికిత్సలు చేసి విజయవంతం చేస్తున్నారు. దీంతో ఆయా గ్రామస్థులు డాక్టర్ ప్రదీప్‌కుమార్‌ను అభినందిస్తున్నారు.

## పి.బోనంగిలో చంద్రన్న బీమా అందజేత

పరవాడ: పరవాడ మండలము పి.బోనంగి గ్రామంలో గొల్లవెల్లి అదిలక్ష్మి అనారోగ్యంకారణంగా మృతి చెందారు. అమె కూతురుకి సర్పంచ్ పైడితల్లిచేతులు మీదగాఐదువేలురూపాయలు చంద్రన్న బీమాను పంపిణీ చేసారు. మిగతావి కార్యము రోజుకి అందేలాకృషిచేస్తామని అన్నారు. కార్యక్రమంలోవిఒఎ మదురిమ, గ్రామపెద్దలుమరియు భీమామిత్రయేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

### వేట విరామ సమయంలో మత్స్యకార జీవనభృతి పెంచాలి

భీమునిపట్నం : వేట విరామ సమయంలో మత్స్యకార జీవనభృతి రూ.4వేలు నుంచి రూ.10 వేలు చేయాలనీ మత్స్యకార నాయకులు కు చెప్పినట్లు భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షులు గంటా నూకరాజు చెప్పారు. నూకరాజు మాట్లాడుతూ ఏప్రిల్15నుండి జూన్15వరకూ రెండు నెలల వేట విరామ సమయంలో ప్రభుత్వం రూ.4వేలు ఇస్తుందని అయితే అవి సరిపోవడం లేదని, దానిపై సర్వే చేయడానికి వచ్చిన మత్స్యకార అధికారులు ఎం.జ్యోత్స్న ,సురేంద్ర లు కు రూ. 4వేలు నుంచి రూ.10 వేలు పెంచడమే కాకుండా నెలకు ఒకొక్క కుటుంబానికి 50కేజీల బియ్యం ఇవ్వాలని కోరినట్లు గంటా నూకరాజు తెలిపారు. ఇంక ఈ కార్యక్రమంలో వీరితో పాటు మత్స్య పరిశ్రమ సహకార సంఘం అధ్యక్షులు పైడిపిల్లి నర్సింగరావు శ్రీరామాంజనేయ మత్స్యకార సంఘం అధ్యక్షుడు కాసరపు నర్సింగరావు,వాసుపల్లి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

### అగ్రిగోల్డ్ బాధితులుకు ప్రభుత్వము న్యాయం చేయాలి

పరవాడ : రాష్టం లో ఉన్న అగ్రి గోల్డ్ బాధితులుకు ప్రభుత్వం న్యాయము చేయాలని పరవాడ మండల అగ్రి గోల్డ్ కష్టమర్స్ మరియుఏజెంట్స్ ఆసోషియేన్ ఆధ్వర్యం లో మంగళవారం పరవాడ డిప్యూటీ తహశీల్దార్ శ్యామ్ కుమార్ ను కలసి వినతిపత్రం అందజేసారు.ఈ సందర్భంగా ఆసోషియేషన్ సభ్యులు పి.సింహాద్రి నాయుడు,పైల హరీష్ మాట్లాడుతూ అగ్రి గోల్డ్ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ,ఆస్తులను విక్రయించి ,అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమం లో ఎజెంట్స్, కష్టమర్ లు పాల్గొన్నారు.



దొండపర్తి వద్ద పరదేశమ్మ ఆలయం సమీపంలో ప్రజాదర్బార్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ 15వవార్డు, 31వవార్డు, 44వార్డుల ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 15వవార్డు అధ్యక్షుడు అల్లూరి సత్యానారాయణరెడ్డి, 31వవార్డు అధ్యక్షుడు నాగేంద్ర, 44వవార్డు అధ్యక్షుడు చిన్నకుమార్, జోనల్ కమిషనర్-2 నల్లనయ్య, జోనల్ కమిషనర్-4 రమణమూర్తి, కోటేశ్వరరెడ్డి, పి.వి.రమణారావు, లక్ష్మీ శివ ప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, శంకరరావు, టీడీపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్యానికి మంచి సిసి రోడ్ల పనులు

రావికమతం : మండలంలో లక్ష్యానికి మించి సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ నిర్మించినట్టు మండల ఇంజనీరింగ్ అధికారి సుమతి తెలిపారు. 24 పంచాయతీల్లో 17.80 కిలో మీటర్లు మేర సిసి రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించగా 19 కిలో మీటర్లు నిర్మించగలిగా మన్నారు. ఇందుకు రూ.3.16 కోట్ల ఖర్చు చేశామని చెప్పారు.

బిజినెస్ ఆఫర్
రూ.750/- పెట్టుబడితో మీ ఇంటి వద్ద నుండే ప్రతిరోజు రూ.2,000/- సంపాదించుకునే అవకాశం కొరకు గృహిణులు, స్టూడెంట్స్, ఉద్యోగస్తులు, నిరుద్యోగులు, ఎంప్లాయిస్ మార్కెటింగ్ వారికి ఆహ్వానం
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
8096645555

డిప్లొమా, బి.టెక్, ఎంబిఎ ఫ్రీ అడ్మిషన్స్ కొరకు
డిప్లొమా, బి.టెక్, ఎంబిఎ కోర్సుల్లో చేరటానికి ఫ్రీ అడ్మిషన్, ఫ్రీ హాస్టల్, ఫ్రీ స్కాలర్‌షిప్ కొరకు ఈ క్రింది ఫోన్ నెంబరును సంప్రదించవలెను.
9948452887

# బెజవాడ గార్డెన్స్‌లో ఆక్రమణల తొలగింపు



యానాం : స్థానిక బెజవాడ గార్డెన్స్‌లో ప్రభుత్వ స్థలాలను ఆక్రమణలను మున్సిపల్ పోలీసు శాఖ అధ్వర్యంలో తొలగించారు. మంగళవారం ఉదయం అగ్రహారం ప్రక్కనే ఉన్న బెజవాడ గార్డెన్స్‌లో సుమారు ఐదుగురు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టడంతో కొందరి ఫిర్యాదుల మేరకు మున్సిపల్ జెఇ మనోహర్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణలను తొలగించారు. ధనామ్మగుడి ప్రక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో అరదాడి నూకరత్నం, బెజవాడ గార్డెన్స్‌లోని సూర్యనారాయణ, వేళ్ళ శ్రీనివాసురాజు, వీరభద్రం, విజయ్‌కుమార్‌ను ప్రభుత్వ స్థలాలోని నిర్మాణాలను తొలగించారు. మరోసారి ఇటువంటి ఘటనలకు పాల్పడితే కేసులు నమోదుచేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ నిర్మాణాలు తొలగించినప్పుడు ఘర్షణకు దిగుతారని ముందుజాగ్రత్తగా పోలీసుబందుబస్తు ఏర్పాటుచేసినప్పటికీ వారికి మద్ధతుగా వచ్చిన నాయకులు అక్కడ ఉండి పరిశీలించివెళ్ళారు.

# ఘనంగా తారక మంత్ర జప హోమం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరంలో విశ్వహిందూ పరిషత్ మరియు శ్రీరామ రక్ష బృందం వారి ఆద్వర్యంలో మంగళవారం తారక మంత్ర జప హోమం శ్రీ వల్లీ దేవసేన సమెత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవాలయంలో అత్యంత ఘనంగా నిర్వహించారు.ఇందులో భాగంగా విశ్వహిందూ పరిషత్ దేశవ్యాప్తంగా అయోధ్య నందు దివ్య రామ మందిర నిర్మాణంలో నెలకొని ఉన్న ఆటంకాలు తొలగి పోవాలని హిందుదేశ ప్రజల చిరకాల వాంఛ నెరవేరి మందిర నిర్మాణం శీఘ్రముగా జరగాలని విశ్వసించి విళంబి నామ ఉగాది సంవత్సరం మొదలు 21రోజులు శ్రీరామ జయరామ జయ జయ రామ విజయ మహా రాత్రి మొదలు జపం నిర్వహించిన భక్తుల ద్వారా స్దానిక శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవాలయంలో శ్రీరామ నామ జప యజ్ఞములు వైభవంగా నిర్వహించబడినవి. ఇందు విశ్వహిందు పరిషత్ జిల్లా కార్య దర్శి భారతుల.ఉదయ్ భాస్కర్, సహాయ కార్యదర్శి ఉదయభానూజీరావ్, చెళ్ళపిళ్ళ.ప్రసాద్ శర్మ, పెండ్యాల.సత్యనారాయణ, కామర్స్ చిరంజీవి మరియు శ్రీరామ రక్ష స్త్రోత్ర పారాయణము వారిచే ఘనంగా హోమము నిర్వహించారు.

# ఉచిత రేషన్ బియ్యం తక్షణం విడుదలచేయాలి లబ్ధిదారుల డిమాండ్

యానాం: చౌకధరల దుకాణంద్వారా ఉచితంగా సరఫరాచేసే బియ్యాన్ని ప్రభుత్వం తక్షణమే విడుదలచేయాలని రేషన్ లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం జనవరి నెలలో బియ్యం విడుదలచేశారని అప్పటి నుండి ఇప్పటివరకు మూడు నెలలు బియ్యం విడుదలచేయక పోవడంవలన లబ్ధిదారులమైన మేము ఇబ్బందులకు గురవుతున్నామని ఈ విషయంపై తక్షణ చర్యలుచేపట్టాలని డిమాండ్‌చేశారు.

పుదుచ్చేరి లఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడి వైఖరివలన బియ్యం విడుదలలో జాప్యం జరుగుతుందని చెప్పిన ప్రభుత్వం అందులో సవరణలు చేసిన ప్పటికీ ఎందుకు విడుదల చేయడం లేదని లబ్ధిదారులు ప్రశ్నించారు. బియ్యం విడుదలకు సంబంధిత కాంట్రాక్టర్లుకు నిధులు విడుదల చేయకపోవడంవలనే కాంట్రాక్టులు ముందుకు రావడంలేదని దీనివలనే ఈ పరిస్థితి ఏర్పడు తుందని బియ్యం విడుదలలలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ప్రజా అవసరాలకోసం ఏర్పాటుచేసిన చౌకడిపోలోని ఉద్యోగులు ఖాళీగా ఉంటూ వేతనాలు చెల్లించడం ఎంత వరకు సబబు అన్నారు. పౌర సరఫరాల శాఖను నిర్వీర్యం అయిపోయే పరిస్థితి ఈ ఘటనవలన రుజువు అవుతుందన్నారు.

ప్రభుత్వం ఈ పథకాన్ని ఎత్తివేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు అనుమానం కలుగుతుందన్నారు. ఇప్పటివరకు మూడు నెలకు బియ్యం సరఫరాచేయవలసి ఉందని వాటిని పూర్తిస్థాయిలో పంపిణీచేసేందుకు చర్యలు చేపట్టాలని లేనియెడలా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళ ౕన చేపడతామని లబ్ధిదారుల హెచ్చరించారు. ఈ విషయంపై పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు పరిపాలనాధికారి దువులూరి సుబ్ర మణ్యశ్వరరావులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# 21న ఆరవ తరగతి నవోదయ ప్రవేశ పరీక్ష

యానాం : జవహార్ నవోదయ విద్యాలయాలలో ఆరో తరగతి ప్రవేశానికి ఈ నెల 21న పరీక్ష నిర్వహిస్తున్నట్లు వైస్ ప్రిన్సిపల్ డిపి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. యానాంలోని మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, రాజీవ్‌గాంధీ ఇంగ్లీష్‌మీడియం ఉన్నత పాఠశాలలో ఉదయం 11.30 నుండి మధ్యాహ్నం 1 గంటవరకు పరీక్ష జరగనున్నాదన్నారు. పరీక్షకు హాజరు కానున్న విద్యార్థులు తమకు సూచించిన పరీక్షా సెంటర్‌లందు ఉదయం 10.30 గంటలకు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. హాల్‌టిక్కెట్ డౌన్‌లోడింగ్ కొరకు అన్‌లైన్ ద్వారా దరఖాస్తుచేసిన సెంటర్ నుండి పొందవచ్చున్నారు. మిగిలిని వివరాలకు ఆఫీసువేళలో అధికారులను సంప్రదించాలన్నారు.

# కోరంగిలో యువకుల శ్రమదానం

తాళ్లరేవు : మండలంలోని కొత్తకొరంగి, దిండి స్మశాన వాటికలో వివేకానంద సేవా సంఘం ఆదర్శ భారత్ యువకులు శ్రమదానం చేశారు. స్మశాన వాటికలో పేరుకుపోయిన తుప్పలను, పలుగు పారా చేతబట్టి నాల్గు గంటలపాటు శ్రమించి శుభ్రంచేశారు. తుప్పలకు నిప్పుపెట్టి తొలగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దడాలరాణి, సంగాని రాంబాబు, పి. జగన్నాధరావు, కె. త్రిమూర్తులు, కె. నాగబాబు, పి. శ్రీక్రిష్ణ, బి. జానకిరాముడు, డి. వెంకటేశ్వర్లు, కె. గంగాధర్, కె. సత్యనారాయణ, టి. హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో తండ్రి, కూతురు దుర్మరణం

తాళ్లరేవు: కైట్ కళాశాలలో ప్రవేశ పరీక్షకు హాజరై తిరిగి వెళ్తుండగా పటవల పైడాకాలేజి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి, కూతుర్లు అక్కడికక్కడ దుర్మరణంపాలైనట్లు కోరంగి ఎస్ఐ సుమంత్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 11 గంటల సమయంలో ప్రవేశ పరీక్ష రాసి కాకినాడ, మధురానగర్‌కు చెందిన దాట్ల శ్రీరామకృష్ణరాజు (48), కూతురు లక్ష్మీ ఇమజ (17) మోటారు వాహనంపై కాకినాడవైపు వెళ్తుండగా కాకినాడ నుండి అమలాపురం రోడ్డుమార్గంలో వెళ్తున్న కారు డబ్ల్యూడిఒ 2 ఎఎ 5929 వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడ మృతిచెందినట్లు తెలిపారు. మృత దేహాలను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను బంధువులకు అప్పగించామన్నారు. ప్రమాదానికి కారుకులైన కారు డ్రైవర్‌ను అరెస్టుచేశామన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ సుమంత్ తెలిపారు. దీనికి సంబందించిన వివరాలు కుటుంబ సభ్యులకు తెలియజేశామన్నారు.

# పెన్షన్‌దారులకు విజ్ఞప్తి

పెద్దాపురం : పెన్షన్‌దారులు వారి లైఫ్‌సర్టిఫికెట్లు డిజిటల్‌ద్వారాకాని, మాన్యువల్‌కాని పెద్దాపురం ట్రెజరీకి ఇంకా సమర్పించనియెడల, ఏప్రిల్ 20 తేదీలోగా ఎ.టి.ఒ. పెద్దాపురం వారికి నేరుగ అందచేయవలసిందిగా కోరడమైనది. లేనియెడల ఏప్రిల్ 2018 పెన్షన్ ఆగిపోనని ఎ.టి.ఒ. పెద్దాపురం ఎం. సూర్యనారాయణమూర్తి తెలిపారు.

# ఆక్వా రంగ సమస్యలు పరిష్కరించకుంటే క్రాఫ్ హాలిడే

అమలాపురం : ధరల పతనం తదితర ఆక్వా రంగ సమస్యలు పరిష్కరించకుంటే ఆక్వా క్రాఫ్ హాలిడే పాటించడానికి వెనుకాడేదిలేదని కోనసీమ ఆక్వా రంగ పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. రొయ్యల ధరలు పతనానికి నిరసనగా మంగళవారం స్థానిక క్షత్రియ కళ్యాణ మండపంలో కోనసీమ ఆక్వా రైతుల సమావేశం త్సవటపల్లి నాగభూషణం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కోటేశ్వరరావు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి హాజరయ్యారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో జాతీయ మార్కెట్‌లో ఏ రోజూ కూడా ఆక్వా ధరలు పడిపోలేదని, అంతర్జాతీయ మార్కెట్‌లో రొయ్యల ధరలు లాభసాటిగా ఉన్నా కొందరు ఎక్స్‌పోర్టులు, దళారులు ఆక్వా రైతులను అయినకాడికి దోచుకుంటున్నారని నాయకులు ఆరోపించారు. అలాగే ఆక్వా ధరలలో హెచ్చుతగ్గులు రాకుండా ఒక వారం రోజుల పాటు స్థిరంగా ఉండేలా ఎక్స్‌పోర్టర్లు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు. ఆక్వా రంగానికి ఎక్స్‌పోర్టరు, సీడ్ మిల్లరు, ట్రేడరు, రైతు ఒక కుటుంబ సభ్యులు లాంటివారని, ఆక్వా రంగానికి గిట్టుబాటు ధర లభించేలా చూడాలని విజ్ఞప్తి చేసారు. వ్యవసాయదారుడు తాము పండించిన పంటలు గిట్టుబాటు ధర లభించే వరకు నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం స్టోరేజ్ గొడౌను సదుపాయం కల్పించాలన్నారు. అలాగే ఆక్వాకు గిట్టుబాటు ధర లభించే వరకు కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ఆక్వా రైతులను ఆదుకోకుంటే క్రాప్ హాలిడే తరహా ఉద్యమాన్ని చేపట్టాల్సి ఉంటుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం ఆక్వా రంగాన్ని ప్రోత్సహిస్తూన్నా జిల్లా యంత్రాంగం తీరుతో అనుమతులు రాకపోవడం ఆక్వా రైతులు ఇబ్బందులు పడుతున్నారని కోనసీమ ఆక్వారంగ ప్రతినిధి త్సవటపల్లి నాగభూషణం పేర్కొన్నారు.

# పలు ప్రజా సమస్యలపై అధికారులతో మంత్రి సమీక్ష



యానాం : కేంద్ర పాలిత ప్రాంతమైన యానాం నియోజకవర్గంలో గోపాల్‌నగర్‌లో నిర్మించేందుకు తలపెట్టనున్న కల్చరల్ సెంటర్‌కు రూ. 14 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు తెలిపారు. ఈ మేరకు పుదుచ్చేరిలోని తన కార్యాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్రప్రభుత్వం పలు సూచనల ఆధారంగా ఈ ప్రతిపాదనలు సిద్ధంచేయడం జరిగిందన్నారు. పూర్తిస్థాయిలో మే 15వ తేదీ నాటికి పంపడం జరుగుతుందన్నారు. అదేవిధంగా యానాం మున్సిపాలిటీలో స్వచ్ఛభారత్ మరుగుదొడ్ల నిర్మాణం, డ్రైనేజ్‌ల శు భ్రపరిచే యాంత్రాల కొనుగోలు, పర్యాటక శాఖకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ నెల 19వ తేదీన యానాం మున్సిపాలిటీ షాపుల అద్దెదారులతో ఒక సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కార్యదర్శి జవహర్, పర్యాటకశాఖ డైరెక్టర్ మునుస్వామి, సిఇ సురేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రాండిక్స్ నిర్వాసితులు (మత్స్యకారులు) సమస్యలను ఐటి మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్లాలి





అచ్యుతాపురం: బ్రాండిక్స్ నిర్వాసితులకు (పూడిమడక మత్స్యకారులు) 3000 మందికి ఉద్యోగాలు కల్పించడంలో బాగంగా బ్రాండిక్స్ యాజమాన్యానికి పూడిమడక జెఎసి కమిటీకు మధ్య జరిగిన ఒప్పందాన్ని (ఎమ్ఒయు) అమలు చేయాలని మాజీ ఉపసర్పంచ్ చోడిపల్లి అప్పారావు అన్నారు. మంగళవారం ఆయన మత్స్యకార నాయకులతో కలిసి బ్రాండిక్స్ నిర్వాసితులు (పుడిమడక మత్స్యకారులు) సమస్యలను రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణ అభివృద్ధి, ఐటి మంత్రి నారా లోకేష్‌కు తెలియజేయాలని స్థానిక ఎపిఐఐసి జెడ్‌ఎమ్‌కు, అచ్యుతాపురం తాహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసారు. బ్రాండిక్స్ పరిశ్రమ పూడిమడక సముద్రంలోకి వేసిన పైపులైను వలన నష్ఠపోయిన మత్స్యకారులకు ర్యాషన్‌కార్డు కలిగిన 3000 మందికి ఉద్యోగాలు కల్పిస్తారని జెఎసి కమిటీతో ఒప్పందం అయింది. 3000 మందిలో 2650 మందికి మాత్రమే ప్యాకేజీలు చెల్లించారు. ఇంకా మిగిలిన 350 మందికి ప్యాకేజీ చెల్లించాలని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు. బ్రాండిక్స్ నిర్వాసితుల సమస్యలను వినతిపత్రం ద్వారా మంత్రి గారికి తెలియజేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో మేరుగు అప్పలనాయుడు, మేరుగు అప్పలరాజు, ఎరిపల్లి కోదండరావు తదితరులు ఉన్నారు.

# చోరీలకు పాల్పడున్న ముఠా సభ్యుడు అరెస్ట్

అమలాపురం : ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ముఠాలోని ఓ సభ్యుడును అమలాపురం తాలూకా సిఐ ఆధ్వర్యంలో పోలీసులు అరెస్ట్ చేసారు. ఇందుకు సంబంధించిన వివరాలను తాలూకా సిఐ దేవకుమార్ వివరించారు. ఈ ఏడాది మార్చి 8వ తేదీ అర్ధరాత్రి దాటిన తరువాత అమలాపురం మండలం బండారులంక గ్రామంలో పేరి శంకరశర్మ ఇంట్లో ఐదుగురు ముసుగులు, చేతులకు గ్లౌజులు ధరించి మారణాయుధాలతో తలుపులు పెకలించి చోరీకి యత్నించారు. దీనిపై అప్పట్లో కేసు నమోదు చేసారు. దర్యాప్తులో భాగంగా సోమవారం నాడు అంబాజీపేట మండలం కె.పెదపూడి గ్రామం రావులపాలెం ఆలయ సమీపంలో ఉన్న నెల్లూరు జిల్లా బోగోలు మండలం తాళ్లూరు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ శ్రీనాధ్‌ను అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన నలుగురు సభ్యులలో ఒకరైన వెంకటపతిరాజు అలియాస్ నాని ఇంటికి వెళ్లగా, సదరు నానిని, కృష్ణంరాజు అలియాస్ రాజేష్, నడింపల్లి సుబ్బరాజు అలియాస్ మహేష్ అనే వారిని రాజోలు పోలీసులు అరెస్ట్ చేసిన విషయం శ్రీనాధ్ తెలుసుకుని తిరిగివెళుతుండగా, పోలీసులు శ్రీనాధ్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా ఐదో వ్యక్తి నెల్లూరు జిల్లాకు చెందిన మారుబోయిన మౌల్యాద్రి గురించి విస్తృతంగా గాలిస్తున్నట్లు సిఐ దేవకుమార్ తెలిపారు. అల్లవరం ఎస్ఐ డి.ప్రశాంత్‌కుమార్, తాలూకా ఎస్ఐ గజేంద్రకుమార్, పిఎస్ క్రైం పార్టీ, హెచ్‌సి అయితాబత్తుల బాలకృష్ణ, పీసీ లంకాడి శ్రీనులు ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేసేందుకు సహకరించారు.

# పిఠాపురం మున్సిపాలిటీలో ఏసీబీ సోదాలు



కాకినాడ:తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం మున్సిపాలిటీలో రాజమహేంద్రవరం ఏసీబీ డీఎస్పీ ఎమ్ సుధాకర్ ఆధ్వర్యంలో ఏసిబి సోదాలు జరుగుతున్నాయి మంగళవారం మధ్యాహ్నం సమయంలో బిల్ కలెక్టర్ నాగబాబు రూ6000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం పిఠాపురం పట్టణం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గొల్లపల్లి క నయ్య అనే వ్యక్తి కొంత కాలం క్రితం ఒక ఇల్లు కనుగోలు చేసాడు ఆ ఇంటి పన్ను నిమ్మిత్తం కన్నయ్య బిల్ కలెక్టర్ నాగరాజును కలిసాడు కార్యాలయం ఖర్చులకు 6000 ఇవ్వాలని నాగరాజు బాధితుడ్ని డిమాండ్ చేసాడు దీంతో కన్నయ్య రెండు రోజుల క్రితం ఏసిబి అధికారులను ఆశ్రయించాడు బాధితుడు నుండి నాగరాజు నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకుని కేసు నమోదు చేశారు ఈ సందర్భంగా కమీషనర్ రామ్మోహన్ రావును కూడా ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు ఏసీబీ ఇన్ స్పెక్టర్లు రామ్మోహనరావు,పుల్లారావు ,తిలక్ ఇతర సిబ్బంది ఈ సోదాల్లో పాల్గొన్నారు మున్సిపాలిటీ కార్యాలయంలో ఏసీబీ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి

# అసిఫా మృతికి కారకులైన వారిని ఉరితీయాలి : రాధమ్మ




అమలాపురం : సామాజిక వేత్త బిఎస్.రాధమ్మ ఆధ్వర్యంలో ఆత్యాచారానికి గురైన కాశ్మీర్ చిన్నారి అసిఫా మృతికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనేక మంది మహిళలు, రాధమ్మ అనుచరులు హాజరై అసిఫాకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రాధమ్మ మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం చట్టాలు ఎన్ని ఉన్నా నిర్వీర్యమవుతున్నా యన్నారు. మోడీ భారత్ వెలిగిపోతుంది, మేకిన్ ఇండియా అంటూ నినాదాలు ఇస్తున్నారు. ఆత్యాచారానికి గురైన చిన్నారుల, మహిళల చితిమంటలతో భారత్ వెలిగిపోతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేసారు. మనకి స్వేచ్ఛ భారత్ కాదు స్త్రీ రక్షా భారత్ రావాలి అని రాధమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. కామాంధుల తరుపున ఏ న్యాయవాది వాదించకుండా బార్ అసోసియేషన్ తీర్మానం చేయాలని పేర్కొన్నారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోడికి, హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లకు గాజులను పోస్ట్ ద్వారా పంపించారు. తదుపరి రాధమ్మ అనుచరులతో సూర్యనగర్ నుండి గడియార స్థంభం వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీని చేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ బిఎస్.రాజు మాట్లాడుతూ జమ్ము-కాశ్మీర్ కథువా ఆత్మాచార ఘటనను పూర్తిగా ఖండిస్తున్నట్లు, ఇది చాలా హేయమైన చర్య అని అన్నారు. పట్నాల వెంకటరమణ మాట్లాడుతూ ఆత్యాచారానికి గురైన ఆసిఫా కుంటుబాన్ని వెంటనే ఆదుకోవాలని, వారికి తక్షణ న్యాయం చేయాలని అన్నారు. యోగా గురు ఇళ్ల నరసింహరావు మాట్లాడూతూ ప్రధాని నరేంద్రమోడీకి పిల్లల ప్రేమ తెలియని మూర్ఖుడని దోషులను వెంటనే శిక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ సాహితీవేత్త నల్లా నరసింహమూర్తి, ఆచార్యులు ఎ.రవీంద్ర, టిఎన్‌టియుసి నాయకులు పట్నాల వెంకటరమణ, యోగా గురు ఇళ్ల నరసింహ రావు, పట్నాల సత్తిబాబు, ఎం.పుష్పవర్ధన్, ఐద్వా పట్టణ కార్యదర్శి టి.నాగవరలక్ష్మి, టిడిపి నాయకులు వలవల శివరావు, పట్టణ సిఐ, ఎస్ఐలు, రాంజీ రెడ్డిబాబు, ఊటాల నరసింహమూర్తి, స్వాతి, రామలక్ష్మి, సీత, కె.శ్రీనివాస్, బొక్కా బానోజీ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మి నరసింహస్వామి నిజరూప దర్శనానికి ఏర్పాట్లు పూర్తి

## దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకు సకల సౌకర్యాలు

## మంత్రి గంటా శ్రీనివాసరావు







విశాఖపట్నం: 'స్వామి నిజరూప దర్శన భాగ్యం ఇంకొన్ని గంటలలోపే' ఆ అమృత ఘడియల కోసం ఎదురు చూస్తున్న భక్తులందరూ అవసరమైన అన్ని ఏర్పాట్లు కల్పించడం జరిగిందని రాష్ట్ర మానవ వనరులశాఖామాత్యులు గంటా శ్రీనివాసరావు వివరించారు. మంగళవారం మంత్రి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు రామచంద్రమోహన్‌తో కలిసి గుడి ప్రాంగణం అంతా తిరిగి పరిశీలించి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. తదుపరి మంత్రి తనను కలిసిన పాత్రికేయులతో మాట్లాడుతూ స్వామి నిజరూపదర్శనానికి భక్తకోటికి చేసిన ఏర్పాట్లను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుండే గాక చుట్టుప్రక్కల రాష్ట్రాల నుండి కూడా స్వామి నిజరూపదర్శన భాగ్యం కోసం విశేషంగా భక్తులు తరలి వస్తారన్నారు. కుటుంబాలతో కలిసి వచ్చి దర్శనం చేసుకుంటారని వారందరకు ఎటువంటి యిబ్బందులు ఎదురవకుండా చలువ పందిళ్లు నిరంతరముగా మంచినీరు, మజ్జిగ అందించే ఏర్పాటు గావించామన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది ఎదురవకుండా ప్రొటోకాల్ మరియు వివిఐపిల దర్శన సమయాలను నియంత్రించామన్నారు. క్యూలైన్లతో భక్తులకు ఎండ తగలకుండా పందిళ్లు ఏర్పాటు, శానిటేషన్, అందుబాటులో ఆరోగ్య సిబ్బంది ఫైర్ సిబ్బంది వుంటారన్నారు. అధికారులు, సిబ్బంది అంతా సమన్వయంతో పనిచేస్తున్నారన్నారు. వాలంటీర్లు కూడా సేవలందిస్తారన్నారు.

ప్రొటోకాల్ దర్శనాలు ఉదయం 5గంటల నుండి 6 గంటల వరకు మరియు వివిఐపి దర్శనాలు 8-9 మరియు 2-3 వరకు ఉంటాయన్నారు. ఈ సమయాలకు అనుగుణంగా వివిఐపిలు, భక్తులు సహకరించాలని కోరారు. అదేవిధంగా గర్భిణీలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సింహాచలం ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు, గంట్ల శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

## నవ్యాంధ్రలో తొలిసారిగా జాతీయ పర్యాటక నిర్వాహకుల సమ్మేళనం

**- సెప్టెంబరు 6 నుంచి 9 వరకు... వేదిక విశాఖ**

**- ఐ.ఎ.టి.ఓ. సహకారంతో ఇక దేశ, విదేశీ పర్యాటకుల వెల్లువ**

**- ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిల ప్రియ**



విజయవాడ: నవ్యాంధ్రలో చూడడానికి ఏముందని కొందరు అడుగుతున్నారు. అసలు ఇక్కడ ఏం లేదో మీరే చెప్పండని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిల ప్రియ అన్నారు. ఒకప్పుడు ప్రసిద్ధ దేవాలయాలకు మాత్రమే పర్యాటకులు వచ్చేవారు... ఇపుడు ఇక్కడ లేనిది లేదు... మెడికల్ టూరిజం, ట్రైబల్, ఎడ్వంచర్,ఎకో, బుద్ధిస్ట్, ఫారెస్ట్...ఇలా అన్ని రకాల పర్యాటకాలకు నవ్యాంధ్ర ఆకర్షణగా నిలుస్తుందని చెప్పారు. నవ్యాంధ్రలో దేశ, విదేశీ పర్యాటకుల అభివృద్ధికి విశాఖలో సెప్టెంబరు 6 నుంచి 9 వరకు ఇండియన్ టూర్ ఆపరేటర్ల సమ్మేళనాన్నినిర్వహించనునట్లు మంత్రి అఖిల ప్రియ వివరించారు. విజయవాడలోని హొటల్ మురళీ ఫార్చ్యూన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి అఖిల ప్రియతోపాటు ఇండియన్ టూర్ ఆపరేటర్ల అసోసియేషన్ ప్రతినిధులు, ఏపీటీడీపీ ఛైర్మన్ హిమాన్షు శుక్లా పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు చొరవతో నవ్యాంధ్ర ప్రదేశ్ లో తొలిసారిగా జాతీయ పర్యాటక నిర్వాహకుల సమ్మేళనం నిర్వహిస్తున్నామని, ఇందులో దేశవ్యాప్తంగా 1,100 మందికి పైగా టూర్ ఆపరేటర్లు పాల్గొంటారని మంత్రి అఖిల ప్రియ తెలిపారు. దేశ, విదేశాల్లో పర్యాటకంలో వచ్చిన మార్పులు, అత్యుత్తమ ప్రమాణాలపై ఈ సమ్మేళనంలో చర్చిస్తామని, ఆపరేటర్లకు నవ్యాంధ్రలో పర్యాటక ప్రాంతాల టూర్ విజిట్ కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు.

**సీఎం చంద్రబాబు పేరు చెపితే... ఏపీ పర్యాటకం గుర్తుకు రావాలి: మంత్రి అఖిల ప్రియ**

దేశ, విదేశాల్లో సీఎం చంద్రబాబు పేరు చెపితే... హైదరాబాద్ నగరం గుర్తుకు వస్తుందని, ఇపుడు ఇక అమరావతి, ఏపీలోని పర్యాటక ప్రదేశాలు గుర్తుకు రావాలని పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిల ప్రియ అన్నారు. తాను ఇటీవల లండన్, స్పెయిన్ వంటి దేశాల్లో పర్యటించినపుడు చాలా మంది నవ్యాంధ్రలో టూరిజంపై ఆసక్తి కనబరిచారని, ముఖ్యంగా శ్రీలంక, సింగపూర్, థాయ్ ల్యాండ్ వంటి దేశాల వారు నవ్యాంధ్ర ప్రదేశ్ లోని బౌద్ధ ఆరామాలను సందర్శించేందుకు ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. విదేశీ పర్యాటకులు ఏదో ఒక ప్రదేశానికి వచ్చి వెళ్ళిపోయేలా కాకుండా, కొద్ది రోజులు ఉండి, టూరిస్ట్ సర్క్యూట్లు అన్ని తిరిగి వెళ్లేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి వివరించారు. గత రెండేళ్ళలో పర్యాటకులను ఆకర్షించేందుకు అద్భుతమైన ఈవెంట్స్ నిర్వహించిన టూరిజం శాఖ, ఈ ఏడాది పర్యాటక స్థలాల్లో మౌళిక వసతులు, అభివ ృద్ధిపై ద ృష్టి పెడుతోందన్నారు. ఇండియన్ టూర్ ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు ప్రణబ్ సర్కార్ మాట్లాడుతూ, ఏటా జరిగే ఈ జాతీయ సదస్సును ఏపీలో నిర్వహించాలని సీఎం చంద్రబాబు కోరిక మీద సెప్టెంబరలో విశాఖలో సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. మైస్ టూరిజం వల్ల ఏపీలో పర్యాటక అభివ ృద్ధి 30 శాతం పెరుగుతుందని, నిరుద్యోగులకు ఉపాధి కూడా లభిస్తుందన్నారు.ఇండియన్ టూర్ ఆపరేటర్ల సంఘం ఉపాధ్యక్షుడు రాజీవ్ మెహ్రా మాట్లాడుతూ, సెప్టెంబరు 6న విశాఖ నొవోటెల్ లో ఈ సమ్మేళనం ప్రారంభం అవుతుందని, 7న విశాఖ బీచ్ ఒడ్డున రన్ ఫర్ టూరిజం నిర్వహిస్తామన్నారు. ఏపీటీడీసీ ఎండి హిమాన్షు శుక్లా మాట్లాడుతూ, విశాఖలో జరిగే ఇండియన్ టూరిస్ట్ ఆపరేటర్ల సమ్మేళనం ఏపీ పర్యాటకానికి కొత్త ఊపు తెస్తుందన్నారు. దీనికి అనుగుణంగా ఏపీటీడీసీ ఈ ఏడాది 6 కొత్త పర్యాటక స్థలాలను అభివ ృద్ధి చేస్తోందని వివరించారు.

## మజ్జిగ కేంద్రం ప్రారంభం

రోలుగుంట : తహశీల్దార్ కార్యాలయం వద్ద మండల తహసీల్దార్ పి.అప్పలనాయుడు ఆధ్వర్యంలో మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం వేసవిని దృష్టిలో ఉంచుకొని పెరుగుతున్న ఉష్ణోగ్రత ఉపసమానంగా కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎండలు ఉన్నంత వరకూ కొనసాగిస్తామని విలేకర్లతో తెలిపారు.

## విఆర్ఎ వేతనాలు పెంచాలని ధర్నా

నర్సీపట్నం : విఆర్ఎల వేతనాలు పెంపు, ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల(విఆర్ఎ)ల సంఘం ఆధ్వర్యంలో నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు.

ఈ సందర్భంగా విఆర్ఎల సంఘం నాయకులు మాట్లాడుతూ విఆర్ఎలకు ప్లేస్కేల్ అమలు చేయాలన్నారు. 010 పద్దుపై వేతనాలు చెల్లించాల, రూ.10,500 వేతనం పెంపు జివొను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్య సంఘం నర్సీపట్నం డివిజన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఇ. సాంబశివరావు, నర్సీపట్నం డివిజన్ అధ్యక్షులు ఎం.రామకృష్ణ, సిపిఎం నాయకులు డి.సత్తిబాబు పాల్గొన్నారు.

## 15 ప్రాంతాల్లో జీడిపిక్కల కొనుగోలు కేంద్రాలు

### వెలుగు ఏపిఎం ఈశ్వరరావు

కొయ్యూరు : జీడి రైతులు దళారులను సమ్మి మోసపోవద్దని వెలుగు ఏపిఎం ఈశ్వరరావు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 15 చోట్ల తూనిక కేంద్రాలను ఏర్పాటు చేసి వెలుగు ద్వారా జీడిపిక్కలను కొనపుగోలు చేస్తున్నామని తెలిపారు. రైతులకు న్యాయం జరగాలన్న ఉద్దేశ్యంతో వెలుగు అధికారులు కాటాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతానికి ఓలం కంపెనీ ప్రకటించిన ధర ప్రకారం కిలో రూ.142కి పిక్కలను కొనుగోలు చేస్తున్నామన్నారు. బయట వ్యాపారులు తూనికలో మోసం చేసే అవకాశం ఉందన్నారు. రైతులు వ్యాపారులకు అమ్ముకోవాలని భావిస్తే తమ కాటాల ద్వారా తూకం వేయించుకొని విక్రయించుకోవచ్చని చెప్పారు.

కొన్ని చోట్ల కిలో రూ.146కు బయట వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని, అయతే తూకంలో మోసాలుంటాయని తెలిపారు. పెదమాకవరం, నడింపాలెం, కంఠారం, మంప, గుడ్లపల్లి, రేవళ్లు, చింతలపూడి, శింగవరం, బంగారంపేట, శరభన్నపాలెం, బూదరాళ్ల, రావణాపల్లి, ధర్మవరం, ఆడాకుల, కొమ్మికలో కాటాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

## కొండపాలెం విఆర్వో బదిలీ

రోలుగుంట : కొండపాలెం వీఆర్వోగా పని చేస్తున్న రత్నం రావికమతం మండలం కొత్తకోటకు బదిలీ అయ్యారు. ఇక్కడమూడు నెలల క్రితం ఆమె విధుల్లో చేరి సహకారంతో విధులు నిర్వహిస్తున్నారు. డిసీజ్డ్‌కోటాలో ఇక్కడ ఆమె విద్యార్హతల ఆధారంగా వీఆర్వోగా నియమితులయ్యారని ఇప్పటి వరకూ అవసరమైన శిక్షణ పూర్తి కావడంతో బదిలీ అయ్యారని డిప్యూటీ తహసీల్దార్ సివి చైన్లు తెలిపారు.

### చంద్రన్న బీమా పేదలకు వరం

నాతవరం : చంద్రన్న బీమా పేదలకు వరమని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి చింతకాయల పద్మావతి అన్నారు. మంగళవారం మర్రిపాలెం గ్రామంలో చంద్రన్న బీమా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రన్న బీమాలో అందరు నమోదు చేసుకోవాలన్నారు. ఇది ఎంతో లాభదాయకంగా ఉంటుందన్నారు.

## స్టడిమెటీరియల్ పంపిణీ

నర్సీపట్నం : అఖిలభారత విద్యార్ధి పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి జరుగుతున్న ఉచిత పాలిటెక్నిక్, ఏపిఆర్‌జెసి కోచింగ్ స్థానిక శ్రీకృష్ణ జూనియర్ కళాశాల నందు ఏబివిపి ఆధ్వర్యంలో ఉచితంగా స్టడీమెటీరియల్‌ను మంగళవారం ట్రాఫిక్ ఎస్సై మురళీధర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఏబివిపి సేవా కార్యక్రమాలను, సమాజ అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని, విద్యార్థులు ఉచిత శిక్షణను వినియోగించుకొని మంచి ర్యాంకులు సాధించి తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ అడిగర్ల సతీష్, స్టూడెంట్స్ ఫర్, డెవలప్‌మెంట్ కన్వీనర్ ఎఎస్ఎస్.కిరణ్, సత్తిబాబు, సాయి, ప్రకాశరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### భీమ్స్ యూత్ కొవ్వొత్తుల ప్రదర్శన

భీమునిపట్నం : జమ్మూకాశ్మీర్ లోని,కధువాలో హత్యాచారం నకు గురైన అసీఫాకు నిరసనగా సంతపేట ఎస్సీకాలనీ భీమ్స్ యూత్ ఆధ్వర్యంలో తగరపువలస జంక్షన్ లో కొవ్వొత్తుల ప్రదర్శన,మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా దళిత నాయకులు జి.వి రమణ, భాగం గోపాలరావు, ఐద్వా నాయకురాలు భాగం లక్ష్మి తదితరులు ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ జమ్మూకాశ్మీర్ లోని కధువాలో, ఉత్తరప్రదేశ్ లోని ఉన్నవ్ లోను జరిగిన ఘటనల నిందితులను ఉరి తీయాలని తెలిపారు. పసిపిల్లల నీ చూడకుండా నిందితులను బాజాపా పాలనలో మహిళలకే కాదు, చిన్నారులకు కూడా రక్షణ కరువయ్యిందనీ అన్నారు.

ఇంకా ఈ కార్యక్రమంలో దళిత నాయకులు ఈశ్వర్రావు, గురునాథ్, శ్రీను, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.







# నేడు అప్పన్న నిజరూప దర్శనం



సింహాచలం : ఆంధ్రుల ఆరాధ్య దై వం ఉత్తరాంధ్ర ఒడిస్సా ప్రజల ఇంటి ఇలవేల్పు దేశప్రజలు భక్తి తో కొలిచేటటువంటి శ్రీ సింహాద్రి అప్పన్న నిజరూపదర్శనం ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ తదియ నాడు జరిపే ఉత్సవం చందనోత్సవం దేశం లో ఏ నృసింహ ఆలయంలో లేని విశిష్టత సింహాచలం శ్రీ వరహా లక్ష్మీనర సింహ స్వామి ఆలయంలో కలదు అది రెండు అవతారములలో స్వామి దర్శన మిస్తుం టారు మొదటిది 364 రోజులు చందనం తో కప్పబడి ఉండగా రెండవది విగ్రహరూపంలో ఉన్న వరహా అవతారం లో చందనోత్సవం నాడు భక్తులకు దర్శనమిస్తారు అంతటి ప్రేత్యేకత వుంది కనుక స్వామి దర్శనం కొరకు ఇతరాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు భక్తుల కొంగు బంగారంగా కోరిన కోర్కెలుతీర్చు కల్పతరువుగా భావిస్తారు అన్ని కాలములందు ఆపదలనుంచి గట్టుఎక్కించేవాడు ఆ అప్పన్న బాబు అంటూ నిజరూపంలో దర్శనం చేసుకుంటూ భక్తుల ఆనంద తో తన్మయత్వం చెందుతారు ఆరోజు రానే వచ్చింది నేడే చందనోత్సవం ప్రతి సంవత్సరం భక్తుల తాకిడి పెరుగుతుండడంతో ఈ సంవత్సరం కూడా సుమారు 2 లక్షల పై చిలుకు ప్రజలు దర్శనంకు వస్తారని అధికారుల అంచనా అందుకు తగ్గట్టుగా సామన్య భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా సామాన్యభక్తునికి పెద్ద పీటవేస్తూ ఎర్పాట్లు చేశారు భారీగా క్యూ లైన్లు ఏర్పాటుచేసి లైన్లలో ఎండలో వేచివుండు భక్తులకు చలవ పందిళ్లు పెండాల్స్ ఏర్పాటుచేసి కాళ్లు కాలకుండా మ్యాట్లు ఏర్పాటుచేశారు .త్రాగునీటి కి ఇబ్బందిలేకుండా ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేశారు స్వచ్ఛంధసంస్థలు దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం మజ్జిగ నీళ్లు పంపిణీకి ఏర్పాట్లుచేశారు అడివివరం పాతగోశాల పార్కింగ్ స్థలంనుంచి కొండ క్రింద బస్ స్టాండు నుంచి కోండపైకి చెరవేసేందుకు ప్రేత్యేక బస్ లు ఏర్పాటుచేశారు ఈ సదుపాయం ఉచితం భక్తులకు ఎటువంటి అనారోగ్య సమస్య తలెత్తిన డాక్టర్ల బృందంతో కూడిన ప్రథమచికిత్స కేంద్రాలను అంబు లెన్సులను సిద్ధంచేశారు ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండ గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు.

**ట్రాఫిక్ పోలీస్ అదికారులు కొండక్రింద ట్రాఫిక్ ఇబ్బంది తలెత్తకుండా ట్రాఫిక్ ఆంక్షలు పెట్టారు జీవీఎంసి దేవస్థానం శానిటేషన్ ఇబ్బంది తలెత్తకుండా ఎక్కువ మంది సిబ్బందిని వినియోగి స్తున్నారు.**

**వికలాంగులకొరకు బ్యాటరీ వాహనాన్ని సిద్ధంచేశారు వారి దర్శనం కి వక ఎస్కార్ట్ నియమించి ఉచితదర్శనం ఏర్పాటుచేశారు దేవస్థానం రెవిన్యూ పోలీస్ జీవీఎంసీ అగ్నిమాపక శాఖ ఇతరశాఖ అదికారులు సమన్వయంతో భక్తులకు యే ఇబ్బంది తలెత్తకుండా బారీ ఏర్పాట్లు చేశారు.**

# ఆరోగ్యవంతమైన సమాజానికై వైద్య సేవలు

### ఉచిత వైద్య శిబిరం లో ఎమ్‌పిఎమ్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్. మూర్తి



విశాఖపట్నం : ఆరోగ్యవంతమైన సమాజానికి ఎమ్‌పిఎమ్ ట్రస్టు కృషి చేస్తుందని రాష్ట్ర శాసన మండలి సభ్యుడు మరియు ట్రస్టు చైర్మన్ డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్. మూర్తి పేర్కొన్నారు. ఎమ్.పి.ఎమ్. ట్రస్టు ఇటీవల ఎన్‌టిఆర్ సేవా సమితి ట్రస్టుతో కలసి నగరపాలక సంస్థ పరిదిలో ఉచిత వైద్య శిభిరాలను నిర్వహిస్తోందని వీటికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కంచరపాలెం సమీపంలోని 36వ వార్డు నేతాజి గ్రంధాలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని డాక్టర్ ఎమ్‌వివిఎస్ మూర్తి ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరాల ద్వారా ప్రజలు తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునే వీలు కలుగుతుందని, సకాలంలో వైద్యం పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించడమే లక్ష్యంగా ఎమ్‌పిఎమ్ ట్రస్టు ఉచిత వైద్య శిబిరాల నిర్వహణపై దృష్టి నిలిపిందన్నారు. గీతం దంత వైద్య కళాశాల ఆసుపత్రి, జిమ్‌సర్ ఆసుపత్రి వైద్య నిపుణులు, పెద్ద ఎత్తున సిబ్బంది వైద్య శిబిరాలలో పాల్గొన్నారు.ఈ శిభిరంలో మూత్రపిండాల సమస్యలు, స్త్రీలసమస్యలు, క్షయ, మోకాళ్ళలో ఆరుగుదల, గుండె జబ్బులకు, పరీక్షలు జరిపారు.ఈ ఉచిత వైద్య శిభిరం ద్వారా స్థానికలలో ఆధికశాతం మంది కంటి సమస్యలు, వినికిడి సమస్యలతో బాధ పడుతున్నాట్లు వైద్యలు గుర్తించారు.

కాగా మంగళవారం 150 మందికి దంత పరీక్షలు, 200 మందికి కంటి వైద్య పరీక్షలు, 100 మంది స్త్రీ సంబంధిత పరీక్షలు, 200 మంది సాధారణ పరీక్షలు నిర్వహించినట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తెలుగు దేశం నాయకులు ఎస్.ఉమామహేశ్వరవు, ట్రస్ట్ నిర్వాహకులు, ఆళ్ల శ్రీనివాసు,లేళ్ళ కోటేశ్వర రావు, దేవారెడ్డి , పాండు, పి.వి.రామారెడ్డి, శంకరావు, దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

# జైట్లీ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం : లోకేశ్



అమరావతి: వాస్తవ పరిస్థితులను అంచనా వేయకుండా అంతా బాగుంది అంటూ కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ మాట్లాడటం బాధాకరమని ఏపీ మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌లో నగదు అందుబాటులో లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ పరంగా పెన్షన్లు, ఉపాధిహామీ వేతనాల చెల్లింపులో కూడా ఇబ్బంది ఎదుర్కొంటున్నామని తెలిపారు.

రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు వివరిస్తూ.. నగదు సరఫరా చేయాలని స్వయంగా ముఖ్యమంత్రి లేఖ రాయడంతో పాటు అనేక సార్లు కేంద్రాన్ని కోరినా ఫలితం లేదని చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర కళ్లు తెరిచి నగదు అందుబాటులోకి తేవాలని నారా లోకేశ్ ట్విట్టర్‌లో అరుణ్‌జైట్లీని కోరారు.

## రూ.500నోట్ల ముద్రణ ఐదు రెట్లు పెంచుతాం

దిల్లీ: దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఏటీఎంలలో విపరీతంగా నగదు కొరత ఏర్పడడంతో ప్రభుత్వం రూ.500నోట్ల ముద్రణను పెంచాలని నిర్ణయం తీసుకుంది. నగదు కొరతను తగ్గించేందుకు రూ.500నోట్ల ముద్రణను ఐదు రెట్లు పెంచుతున్నామని ప్రభుత్వం వెల్లడించింది. నగదు కొరత తగ్గించేందుకు ఈ ముద్రణను అయిదు రెట్లు పెంచుతాం.

# ఐపీఎల్ ఆటగాళ్లపై బీసీసీఐ పర్యవేక్షణ

దిల్లీ: భవిష్యత్తు భారత క్రికెట్ ఆశా కిరణాలుగా కనిపిస్తున్న 23 మంది ఆటగాళ్లపై బీసీసీఐ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో వారి పనిభారాన్ని చాలా అత్యంత సున్నితంగా పర్యవేక్షించనుంది. అయితే వీరంతా బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్‌లో లేనివారే. పృథ్వీషా, శివమ్ మావి వంటి అండర్-19 ప్రతిభావంతులు, దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారించిన మయాంక్ అగర్వాల్, భారత్-ఏ జట్టు పరిధిలో ఉన్నవారు పర్యవేక్షణలో ఉంటారు. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్‌లో చాలా జట్లు అండర్-19, భారత్-ఏ, దేశవాళీలో యువ క్రికెటర్లను కొనుగోలు చేశాయి. అయితే అందరికీ తుది 11 మందిలో చోటు దక్కకపోవచ్చు. శివమ్ మావితో క్రిస్‌లిన్‌కు, నవ్‌దీప్ సైనీతో ఏబీ డివిలియర్స్‌కు సాధన సమయంలో 60-100 బంతులు వేయాలని ఫ్రాంచైజీలు కోరవచ్చు.

ఇది వారి శరీరానికి మించిన భారం కావొచ్చు. భువనేశ్వర్ కుమార్ వంటి సీనియర్లలా కుర్రాళ్లు తమ పనిభారాన్ని అంచనా వేయలేరు కాబట్టి బీసీసీఐ ఈ పర్యవేక్షణ నిర్ణయం తీసుకుంది.







VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ĸ Phone : 2564353, Fax : 0891-2569004 ĸ e-mail: vijayabhanudaily@gmail.com